## సిఐటియు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి : రాజయ్య



కార్మికులకు సూచనలు చేస్తున్న దృశ్యం

**పటాన్‌చెరువు, అక్టోబరు 22, ప్రభాతవార్త:** డిసెంబరు 21, 22వ తారీఖులలో సిద్దిపేటలో జరిగే సిఐటియు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాల్సిన అవసరం ప్రతి కార్మికుడిపై ఉందని సిఐటియు రాష్ట్ర కమిటి సభ్యులు రాజయ్య అన్నారు. శనివారం పాశమైలారం పారిశ్రామిక వాడలోని ఆగ్రో పరిశ్రమలో కార్మికులతో గేట్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు రాష్ట్ర కమిటి సభ్యులు రాజయ్య మాట్లాడుతూ కార్మికుల సమస్యలపైన నిరంతరం పోరాడుతున్న సంఘం సిఐటియు అన్నారు. కార్మికుల క్షేమం కోసం నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభలకు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు జహాంగీర్ గౌడ్, సంతోష్‌గౌడ్, రాములు, జంగయ్య, సురేందర్, రాజు, మల్లేశం పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

### -పోలీసు అధికారులతో న్యాయమూర్తి సూరిక్రిష్ణ

**జహీరాబాద్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** మండల లీగలన సర్వసెస్ కమిటి జహీరాబాద్ ఆధ్వర్యంలో నవంబరు 12వ తారీఖున నిర్వహించే లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా పోలీసు అధికారులు తమ వంతు చర్యలు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి కె సూరిక్రిష్ణ సూచించారు. శనివారం పట్టణంలోని కోర్టు కాంప్లెక్స్‌లో నిర్వహించిన సమావేశానిని న్యాయమూర్తి సూరిక్రిష్ణ ముఖ్య అతిథిగా హాజరై పోలీసు అధికారులు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి సూరిక్రిష్ణ, జూనియర్ సివిల్ జడ్జి జి అనూషలు మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో కేసులను పరిష్కరించుకుంటే డబ్బు ఆదా కావడంతో పాటు సమయం మిగుగులుందన్నారు. కక్షిదారులు పోలీసు అధికారులను, న్యాయవాదులను, మండల లీగల్ సర్వీసెస్ కమిటి కార్యాలయాలను సంప్రదించి కేసుల పరిష్కారానికి సూచనలు పొందాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు దత్తాత్రేయరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శంకర్, కార్యదర్శి సంతోష్‌కుమార్ సాగర్, న్యాయవాదులు, డిఎస్‌పి రఘు పాల్గొన్నారు.



జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

## పోడు భూములను పట్టా చేయాలి

**టేక్మాల్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** పోడు భూములను దళితులకు, గిరిజనులకు పట్టా చేయాలని కోరుతూ జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. శనివారం టేక్మాల్ మండల పరిధిలోని చంద్రుతండాను ఆయన సందర్శించి స్థానిక గిరిజనులతో మాట్లాడారు. గత 45 ఏళ్లుగా అచ్చన్నపల్లి దళితులు, చంద్రుతండా గిరిజనులు పాపన్నపేట నామపూర్ గ్రామశివారులో గల ఆటవీ భూములను సాగు చేసుకోని జీవ నం సాగిస్తున్నారు. సాగు చేసిన భూమిలో ఆటవీ శాఖ అధికారులు చెట్లు నాటడం, సాగు చేస్తున్న వారికి కేసులు పెట్టడం వంటి చర్యలు చేపడుతూ వారి మనోభవాలను దెబ్బతీయడం లాంటి పనులు చేయడం చేశారు. దళిత, గిరిజన రైతులు ధర్నా చేపట్టి డిప్యూటీ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఉన్న పోడు భూములను వెంటనే ప్రభుత్వం పట్టా చేయాలని డిమాండ్ చేశారు. ఆయన సానుకూలంగా స్పందిచినట్లు వారు చెప్పారు. వారం రోజుల్లోనసంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తమని హామి ఇచ్చినట్లు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో చంద్రు తండా సర్పంచ్ స్రవంతి సర్దార్, అచ్చన్నపల్లి సర్పంచ్ కవిత అశోక్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పథకం సమాజిక తనిఖీ ప్రజా వేదిక



సమావేశంలో పాలొన్న డిఆర్‌డిఓ శ్రీనివాసరావు, ఎంపిడిఓ

**సంగారెడ్డి, అక్టోబరు 22, ప్రభాతవార్త:** హత్నూర మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలలో చేపట్టిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాది హామీపథకం సమాజిక తనిఖీ 13వ విడత, ప్రజా వేదిక శనివారం హత్నూర మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జరిగింది. ఈకార్యాక్రమానికి డిఆర్‌డిఓ శ్రీనివాస్‌రావు, ఎంపిడిఓ శారదాదేవి, ఉపాధిహామీ పథకం అధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యాదర్శులు ఇతర అధికారులు హాజరయ్యారు. మండలంలోని 38 గ్రామపంచాయతీలలో చేపట్టిన 17కోట్ల 13లక్షల రుపాయలకు సంబందించి చేపట్టిన పనులకు సంబందించి ప్రజా వేదికను నిర్వహించారు. సమాజీక తనిఖీ సిబ్బంది జనవరి 2019సంవత్సరం నుండి మార్చి 31,2022 వరకు గ్రామాలలో చేపట్టిన పనులకు సంబందించి, ఇప్పటికే ఆయా గ్రామాలలో గ్రామస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. గ్రామస్థాయిలో గ్రామసభలు నిర్వహించారు. అనంతరం శనివారం హత్నూరలో మండలస్థాయి ప్రజావేదికను నిర్వహించగా, సమాజిక తనిఖీ సిబ్బంది అయా గ్రామాలలో చేపట్టిన పనులపై వచ్చిన అభ్యంతరాలను సభలో వివరించారు. కార్యాక్రమంలో ప్రెసైడింగ్ అధికారి శ్రీనివాసరావు, అంబుడ్స్ పర్సన్ భోజిరెడ్డి, సహయ విజిలెన్స్ అధికారి ఎస్. నాగేశ్వర్‌రావు, క్వాలిటి కంట్రోల్ అమర్‌నాథ్, ఎంపిడిఓ శారదదేవి, ఎంపిఓ సువర్ణ, ఎపిఓ, పంచాయతీ కార్యాదర్శులు, ఫీల్ట్ అసిస్టెంట్లు పాల్గోన్నారు.

## అక్రమ నిర్మాణాలు కూల్చివేత



సంగారెడ్డిలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

**సంగారెడ్డి, అక్టోబరు 22, ప్రభాతవార్త:** సంగారెడ్డి మున్సిపాలిటి పరిధిలోని వివిద వార్డులలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను శనివారం సంబందితశాఖల అధికారులు కూల్చివేశారు. మున్సిపాలిటి పరిధిలోని 11 మరియు 12, 8, 30 వార్డులలోని నిర్మాణాలను సంగారెడ్డి డిటిఎఫ్ ఆద్వర్యంలో ఆర్‌డిఓ, సంగారెడ్డి డిఎస్పీల పర్యవేక్షణలో నిర్మాణాలను కూల్చి వేసినట్టు స్థానిక మున్సిపల్ కమీషనర్ తెలిపారు. మొత్తం ఆరు అక్రమ నిర్మాణాలను కూల్చి వేసినట్లు తెలిపారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ టిఎస్‌బిపాస్ ద్వారా ఇంటి నిర్మాణాలకు అనుమతులు తీసుకోవాలని, తీసుకున్న అట్టి అనుమతి పత్రా లను నిర్మాణాం చేపడుతున్న చోట ప్రధర్శించాలని అన్నారు. అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలను కూల్చి వేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## పశువులకు సోకే లంపీ స్కిన్ వ్యాధి అత్యంత ప్రమాదకరం

### -జిల్లా పశు వైద్యాధికారి వెంకటయ్య

**కొల్చారం, అక్టోబర్22 ప్రభాతవార్త:** పశువులకు సోకే లంపీ స్కిన్ వ్యాధి అత్యంత ప్రమాదకరమని, వచ్చే నెల 2వ తేదీ వరకు పశువులకు లంపీ స్కిన్ వ్యాధి టీకాలు వేయనున్నామని, ఈ వైద్య శిబిరాలను సద్వినియోం చేసుకొని రైతులు పశువులకు టీకాలు వేయించుకోవాలని జిల్లా పశు వైద్యాధికారి వెంకటయ్య, వెటర్నరీ అసిస్టెంట్ అకుల గట్టయ్యలు అన్నారు. శనివారం కొల్చారం మండల పరిధిలోని నాయిని జలాల్‌పూర్ గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా పశు వైద్యాధికారి వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలో పశువులకు లంపీ స్కిన్ వ్యాధికి సంబంధించిన టీకాను ఉచితంగా వేశారు. లంపీ స్కిన్ వ్యాధి అత్యంత ప్రమాదకరమని అన్నారు. ఇప్పటి వరకు ఆరు మండలాల్లో పశువులకు లంపీ స్కిన్ వ్యాధిని గుర్తించామన్నారు. రైతులు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు వైద్యాధికారి వెంకటయ్య, వెటర్నరీ అసిస్టెంట్ అకుల గట్టయ్యలు సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మైపాల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



పశువులకు లంపీ స్కిన్ టీకాలు వేస్తున్న దృశ్యం

# అనర్హులకు డబుల్ ఇళ్లు

### - పోలీస్ పహారాలో లాటరీ
### - జాబితాలో అక్రమాలంటూ కాంగ్రెస్ ధర్నా



అర్హుల జాబితా ముందు ప్రకటించాక లాటరీ పద్ధతి చేపట్టాలంటూ ఆర్డీవోతో వాగ్వాదానికి దిగిన కాంగ్రెస్ కౌన్సిలర్లు

**జోగిపేట, అక్టోబర్ 22, ప్రభాతవార్త:** మూడు సంవత్సరాలుగా నానుతున్న అందోలు–జోగిపేట మున్సిపాలిటీలో డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు ఎట్టకేలకు శనివారం గొడవలు, వాగ్వాదాల మధ్య పోలీసుల పహారాలో పూర్తయింది. మున్సిపాలిటీ పరిధిలో జోగిపేటలో 252, అందోలులో 354 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేశారు. వీటికోసం వేలల్లో దరఖాస్తులురాగా పలుసార్లు ఇంటింటికి తిరిగి విచారణ జరిపి చివరకు 825మందిని అర్హులుగా అధికారులు గుర్తించారు. వీరికి ఇండ్లను కేటాయించేందుకుగాను ఆర్డీవో అంబదాస్ రాజేవ్వర్ ఆధ్వర్యంలో శనివారం అందోలు శివారులలోని లక్ష్మీనర్సింహస్వామి కళ్యాణమండపంలో లాటరీ పద్ధతి చేపట్టారు. కాగా, ఈ సమావేశానికి విచ్చేసిన కాంగ్రెస్ కౌన్సిలర్లు చిట్టిబాబు, డాకూరి శంకర్, హరిక్రిష్ణాగౌడ్, రంగ సురేష్‌లతోపాటు కాంగ్రెస్ నాయకులు డాకూరి వెంకటేశం, ప్రవీన్, ప్రదీప్‌గౌడ్, తుడుం రాములు, శరత్‌బాబు, గుర్రపు క్రిష్ణ, కొశికె రాజశేఖర్‌లు సమావేశాన్ని అడ్డుకుని ముందు అర్హుల జాబితాను చదివి వినిపించాలని పట్టుబట్టారు. అంతేకాకుండా ఈ ఇళ్ల నిర్మాణం జరిగిన స్థలంలో కొంత మందికి ప్రభుత్వం కేటాయించిన ప్లాట్లు కోల్పోయారని, వారు కోర్టులను ఆశ్రయించారని, వారి జాబితా తెలియచేయాలని పట్టుబట్టారు. అయితే ఆర్డీవో లాటరీ పద్ధతిని ప్రారంభించే ప్రయత్నం చేయటంతో అధికారులు, కాంగ్రెస్ నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో వేదికపైనే ఉన్న టిఆర్‌ఎస్ నాయకులు జోక్యం చేసుకుని జాబితాను ముందుగా ప్రకటించేదేమీ లేదని, లాటరీ పద్ధతిని ప్రారంభించాలని పట్టుబట్టడంతో కాంగ్రెస్ నాయకులు మరింత రెచ్చిపోయారు. అర్హుల జాబితాలో అక్రమాలు చోటు చేసుకున్నాయని, టిఆర్‌ఎస్ కౌన్సిలర్ల ఇళ్లలోనే రెండు, మూడు డబుల్ బెడ్రూం ఇళ్లు రాసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుపేదలకు అందాల్సిన డబుల్ బెడ్రూంలు అనర్హులకు అందచేస్తున్నారని, ఇది సరైందికాదని విమర్శించారు. కనీసం కౌన్సిలర్లకు కూడా సమాచారం లేకుండా ఆదరాబాదరాగా రాత్రిరాత్రి నిర్ణయాలు తీసుకుని సమావేశాలు నిర్వహించటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఓ దశలో డబుల్ బెడ్రూం ఇళ్లలో అనర్హులు లేరని నిరూపిస్తే తమ కౌన్సిలర్ పదవికి రాజీనామాలు కూడా చేయడానికి సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ కౌన్సిలర్లు తీవ్రమైన అసంతృప్తిని వ్యక్తం చేశారు. కాంగ్రెస్, టిఆర్‌ఎస్ నాయకుల మధ్య వాగ్వాదంతో సుమారు గంటన్నరపాటు లాటరీ పద్ధతిన ఇళ్ల కేటాయింపును ప్రారంభించలేకపోయారు. జోగిపేట సర్కిల్ ఇన్స్‌పెక్టర్ నాగరాజు, ఎస్ఐ సామ్యానాయ్, పుల్కల్ ఎస్ఐ గణేష్, వట్‌పల్లి ఎస్ఐల ఆధ్వర్యంలో పోలీసులు కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లను సముదాయించే ప్రయత్నించినా కూడా వారు మొండికేశారు. చివరకు కనీసం కోర్టుకు వెళ్లిన వారి జాబితానైనా ముందుగా ప్రకటించాలని కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు పట్టుబట్టడంతో జోగిపేటకు చెందిన 35మంది, అందోలుకు చెందిన 4కి ఇండ్లు కేటాయిస్తున్నామని వారు పేర్లను చదివి వినిపించటంతో కాంగ్రెస్ కౌన్సిలర్లు సంయమనం పాటించారు. అనంతరం లాటరీ పద్ధతిని ఆర్డీవో అంబదాస్ నాగేష్ ప్రారంభించారు. మొదటి చీటీని మున్సిపల్ వైస్ ఛైర్మెన్ ప్రవీన్‌కుమార్ తీసి డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపును ప్రారంభించారు. మొత్తానికి తీవ్రమైన గందరగోళ పరిస్థితుల మధ్య అందోలు–జోగిపేట మున్సిపల్ పరిధిలో డబుల్ బెడ్రూం ఇండ్ల కేటాయింపు జరిగింది.

### రోడ్డెక్కిన కాంగ్రెస్ నాయకులు

అందోలు–జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు విషయంలో తీవ్రమైన అక్ర మాలు జరిగాయని, అనర్హులకు కేటాయించారని, టిఆర్ఎస్ కార్యకర్తలకే వీటిని కేటాయించారని, కొందరైతే ఏకంగా కౌన్సిలర్లే ఇళ్లు రాసుకున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ ఇళ్ల కేటాయింపు సమావేశాన్ని నిర్వహిస్తున్న ఫంక్షన్ హాలు ముందల సంగారెడ్డికి వెళ్లే ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. కేసిఆర్ డౌన్ డౌన్ అని, ఈ పాలన మనకొద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కనీసం కౌన్సిలర్లకు కూడా సమాచారంలేకుండా హడావుడిగా సమావేశం ఏర్పాటుచేసి ఇండ్లు కేటాయించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు జరగలేదని వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం రచ్చబండ సమావేశం నిర్వహించి అందులో ఎంపిక చేసిన వారికి వీటిని కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికీ ప్రభుత్వం గతంలో ఇళ్ల స్థలాలు పొంది, ఈ డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి ఆ స్థలాలు కోల్పోయినప్పటికీ, ఈ డబుల్ బెడ్రూంల కేటాయింపు జరగనివారు ఇంకా ఉన్నారని, ముందుగా వారికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లో నిరుపేదలకు జరుగుతున్న అన్యాయాన్ని సహించేది లేదని, డబుల్ బెడ్రూం కేటాయింపులో జరిగిన అక్రమాలపై అవసరమైన చర్యలకు తాము సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ కౌన్సిలర్లు డాకూరి శంకర్, చిట్టిబాబు, హరిక్రిష్ణాగౌడ్, రంగసురేష్‌లు పేర్కొన్నారు. సుమారు అరగంటపాటు వారు ధర్నా చేశారు. పోలీసులు జోక్యం చేసుకొని వారితో ధర్నా విరమింపచేశారు.

### నిరసన తెలిపిన నిరుపేదలు

డబుల్ బెడ్రూం ఇండ్లకోసం దరఖాస్తులు చేసుకొన్నప్పటికీ, అర్హులైనా తమకు అవి దక్కకపోవటంతో పలువురు నిరుపేదలు లాటరీ పద్ధతి ముగిశాక తీవ్రమైన నిరసన వ్యక్తం చేశారు. అనర్హులకు ఇళ్లు కేటాయించారని, మా లాంటి నిరుపేదలకు అన్యాయం చేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఓ దశలో వారంతా రోడ్డుపై ధర్నా చేసేందుకు సిద్ధం కాగా, పోలీసులు వారిని వారించి ధర్నా చేయకుండా అడ్డుకున్నారు.



డబుల్ బెడ్రూంల కేటాయింపులో అక్రమాలు జరిగాయంటూ ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## ద్విచక్ర వాహనాల దొంగల ముఠా అరెస్టు

### - ఏడుగురు ముఠా సభ్యులు అరెస్టు
### -30 లక్షల విలువ చేసే 28 బైక్‌లు స్వాధీనం : ఎస్పీ

**పెద్దశంకరంపేట, అక్టోబర్22 ప్రభాతవార్త:** మెదక్ జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లో కూడా ద్విచక్ర వాహనాలను చోరీ చేసిన ఏడుగురు ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుండి 30 లక్షల విలువ చేసే 28 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ భారీ దొంగతనానికి సంబంధించిన వివరాలను మెదక్ జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని శనివారం పెద్దశంకరంపేట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏర్పాటు చేశారు. పెద్దశంకరంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గత జూన్ నెలలో ఒక బైక్, సెప్టెంబర్ నెలలో మరొక బైక్ చోరీకి గురయ్యాయి. ఈ రెండ్ బైక్‌ల దొంగతనానికి సంబంధించిన కేసును పోలీసులు విచారిస్తున్నారు. ఈ క్రమంలో గత వారం రోజుల క్రితం పట్టణ శివారులోని తిరుమలాపూర్ బ్రిడ్జి వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నప్పుడు నెంబర్ ప్లేట్ లేని రెండు బైక్‌లపై ముగ్గురు వ్యక్తులు వేగంగా వచ్చి వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి అక్కడి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయగా పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారన్నారు. ఈ ముగ్గురిని పోలీసులు విచారించగా వివిధ మరికొన్ని బైక్‌ల దొంగతనాలలో పాల్గొన్న మరొక నలుగురి దొంగల వివరాలను వారు వెల్లడించడంతో ఈ బైక్‌ల దొంగతనం వెలుగుచూసిందని తెలిపారు. మొత్తం ఏడుగురు నిందితులు నిజామాబాద్ జైలులో పరిచయం చేసుకొని ఒక ముఠాగా ఏర్పడి కారులో వచ్చి బైక్‌లను దొంగిలించే వారని ఆమె తెలిపారు. ఈ ముఠా సభ్యులు పెద్దశంకరంపేట పరిధిలో రెండు బైక్‌లు, టేక్మాల్ పరిధిలో ఒకటి, చేగుంట పరిధిలో రెండు, మనోహరాబాద్ పరిధిలో రెండు, సంగారెడ్డి జిల్లా పరిధిలోని ఎనిమిది బైక్‌లు, భువనగిరి జిల్లాలో ఒకటి, నల్లగొండ జిల్లాలో ఒకటి, కామారెడ్డి జిల్లాలో ఒకటి, మేడ్చల్ జిల్లాలో ఒకటి, హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి మొత్తం 20 బైక్‌లను దొంగలించినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. ఇవే కాకుండా మరో ఎనిమిది బైక్‌ల ఇంజన్ నెంబర్, ఛేస్ నెంబర్లను తొలగించడంతో వాటి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. నారాయణఖేడ్‌కు చెందిన ప్రశాంత్‌గౌడ్, శివ్వంపేట మండల పరిధిలోని శంభోజిపల్లికి చెందిన షేక్ ఫయాజ్, చాపల సంజీవ్, రామాయంపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన పున్న హరీష్, నిజాంపేట మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన బోయిని ప్రశాంత్, నిజామాబాద్ జిల్లా నాగారం గ్రామానికి చెందిన హరికృష్ణ, అదే జిల్లాకు చెందిన మక్కల లక్ష్మణ్‌లు ఏడుగురు ఒక ముఠాగా ఏర్పడి 30 లక్షల విలువ చేసే 28 బైక్‌లను దొంగలించినట్లు పేర్కొన్నారు. వీరు దొంగతనంకు ఉపయోగించిన ఒక కారు, ఒక బైక్‌ను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఏడుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ సైదులు, అల్లాదుర్గం సీఐ జార్జ్, శంకరంపేట, రేగోడ్ ఎస్ఐలు బాలరాజు, సత్యనారాయణ, ఏఎస్ఐలు అశోక్, సునీత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



దొంగలను చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

### పోలీసులను అభినందించిన జిల్లా ఎస్పీ...

ద్విచక్ర వాహనాల దొంగల ముఠాలను పట్టుకున్న పెద్దశంకరంపేట ఎస్ఐ బాలరాజు, ఏఎస్ఐ అశోక్, కానిస్టేబుళ్ల వినోద్, రాము, రాంసింగ్‌లను జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని ప్రత్యేకంగా అభినందించారు.



కోర్టు డ్యూటీ పోలీసు అధికారులతో సమావేశమైన జిల్లా ఎస్పీ

## బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

### జిల్లా ఎస్పీ కోర్టు పోలీసు అధికారులకు సూచన

**సంగారెడ్డి టౌన్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** కోర్టు డ్యూటీ నిర్వహించే పోలీసు అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ నేరస్తులకు శిక్షలు పడేలా చూడాలని జిల్లా ఎస్పీ యం రమణ కుమార్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో కోర్టు డ్యూటీ అధికారులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ రమణకుమార్ మాట్లాడుతూ నేర రహిత సమాజంగా తీర్చిదిద్దుటకు గాను నిందితులకు కోర్టులో శిక్షపడే విధంగా కోర్టు పోలీసు సిబ్బంది శ్రమించాల్సి ఉంటుందన్నారు. కోర్టులో ఎఫ్‌ఐఆర్‌లు, కేసులో పేర్కొన్న ప్రాపర్టీని సరైన సమయాల్లో అందించేలా చొరవ చూపాలన్నారు. కోర్టు పోలీసులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన పద్ధతులపై ఎస్పీ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిసిఆర్‌బి ఇన్స్‌పెక్టర్ జేలేందర్‌రెడ్డి, డిసిఆర్‌బి యస్ ఐ బలస్వామి, కోర్టు లైజనింగ్ అధికారులు సత్యనారాయణ, జిల్లాలోని కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## ఒక్క సిసి కెమెరా వందమందితో సమానం

### జిల్లా ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

**సంగారెడ్డి, అక్టోబర్ 22, ప్రభాతవార్త:** రేగోడ్ మండలపరిధిలోని తిమ్మాపూర్‌లో శనివారం మెదక్ జిల్లా ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని సిసి కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఒక్క సిసి కెమెరా వందమందితో సమానమని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు సిసి కెమెరాలపై అవగాహన కల్పించారు. గ్రామల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో చోరిలు, అల్లర్లు జరగవని, సిసి కెమెరాలలో దొంగలను, అల్లారిమూకలను గుర్తించవచ్చని, కెమెరాలను ఎంతో సహాయకారిగా ఉంటూ మూడో నేత్రంగా అవి పనిచేస్తాయని అన్నారు. రేగోడ్ మండలంలోని ప్రతి గ్రామాలలోకూడా సిసి కెమెరాలను ఏర్పాటుచేసుకోవాని ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ డిఎస్పీ సైదులు, అల్లాదుర్గం సిఐ జార్జ్, ఎస్ఐ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు సిసి కెమెరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ ప్రియదర్శిని

## క్రీడా స్ఫూర్తితో ఉన్నత స్థానాలకు ఎదగాలి

### తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి

**శివ్వంపేట, అక్టోబర్22 ప్రభాతవార్త:** క్రీడా స్ఫూర్తితో వివిధ ప్రాంతాల క్రీడాకారులు నైపుణ్యం ప్రదర్శిస్తూ ఉన్నత స్థానాలకు ఎదగాల్సిన అవసరం ఉందని తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శివ్వంపేటలో తూప్రాన్ సీఐ శ్రీధర్, శివ్వంపేట ఎస్ఐ రవికాంత్‌రావు ఆధ్వర్యంలో రెండు రోజులుగా తాలుకా స్థాయి వాలీబాల్ టౌర్నమెంట్ క్రీడోత్సవాలు నిర్వహించారు. క్రీడల ముగింపు కార్యక్రమంలో భాగంగా గెలుపొందిన విజేతలకు బహుమతులతో పాటు నగదు పురస్కారం అందజేశారు. ఈ వాలీబాల్ పోటీలలో 45 జట్లు తలపడ్డాయి. ప్రథమ స్థానం శివ్వంపేట పోలీస్ జట్టుకు 30 వేల రూపాయలు, ద్వితీయ స్థానం హత్నూర మండలం దౌల్తాబాద్ జట్టుకు 20 వేల రూపాయలు, తృతీయ స్థానం కొత్తపేట జట్టుకు 10 వేల రూపాయల నగదుతో పాటు మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీధర్, ఎస్ఐలు రవికాంత్‌రావు, రమేష్, రాజు, వ్యాయామ ఉపాధ్యాయులు ఆంజనేయులు, కిషోర్, వాలీబాల్ కోచ్ జానీతో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ క్రీడల నిర్వహణకు పూర్తి సహాయ సహకారాలు అందించిన ఎంపీపీ అధ్యక్షులు కల్లూరి హరికృష్ణకు డీఎస్పీ యాదగిరిరెడ్డి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా క్రీడాకారులతో పాటు అక్కడికి వచ్చిన వీక్షకులకు అన్నదానం ఏర్పాటు చేసిన టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొడకంచి శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌గౌడ్‌లకు అభినందనలు తెలిపారు.



ఫోటో4: క్రీడాకారులకు మెమెంటో అందజేస్తున్న డీఎస్పీ యాదగిరిరెడ్డి


పత్తి పంటను పరిశీలిస్తున్న దృశ్యం

## బొడ్మట్‌పల్లిలో పత్తి పంట పరిశీలన
**టేక్మాల్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బొడ్మట్‌పల్లి గ్రామంలో వేసిన అంకుర్ సీడ్స్ పత్తి పంటను అంకుర్ యాజమాన్యం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలను వాడాలని వాటితో దిగుబడి అధికంగా వస్తుందని అన్నారు. బొడ్మట్‌పల్లి గ్రామానికి చెందిన అందోల్ విఠల్ అనే రైతు చేలో వేసిన పంట అధికంగా కాసిందని ఆరైతును యాజమాన్యం సన్మానించారు. రైతులు వ్యవసాయ మెలుకువలు పాటించి అధిక దిగుబడిని పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో అంకుర్ సీడ్స్ ఏరియా మేనేజర్ శ్రీకాంత్, వీరభద్ర ఫర్టిలైజర్స్ ప్రొపరేటర్స్ శంకరప్పపాటిల్, వినోద్ పాటిల్, అంకుర్ సీడ్స్ ప్రతినిధులు కమలాకర్, గ్రామ సర్పంచ్ స్వరూప దశరత్‌గౌడ్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి
**పాపన్నపేట, అక్టోబరు 22, ప్రభాతవార్త:** మద్యం తాగిన మైకంలో ఒంటికి నిప్పంటించుకుని చికిత్స అందుకుంటూ తిరిగిరాని లోకానికి చేరిపోయిన సంఘటన మండలంలోని యూసుఫ్‌పేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన తీగల దుర్గాగౌడ్ (36) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మధ్యానికి బానిసైన దుర్గాగౌడ్ నిత్యం మద్యం సేవిస్తూ ఇంటికి రావడంతో ఇంట్లో గొడవలు చోటుచేసుకోవడం పరపాటిగా మారింది. మధ్యానికి డబ్బులు ఇవ్వాలని లేకుంటా ఆత్మహత్య చేసుకుంటానని భయపెడుతూ వచ్చాడు. ఈ నెల 19న రాత్రికి అతిగా మద్యం సేవించి ఇంటి ముందరే ఒంటిపై డీజిల్ పోసుకుని నిప్పంటించుకున్నాడన్నారు. క్షతగాత్రుడిని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్సలు అందించి పరిస్థితి విషమంగా ఉండటంతో హైద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. గాంధీలో చికిత్స అందుకుంటూ శుక్రవారం రాత్రికి మృతి చెందాడన్నారు. మృతుడి భార్య వాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విజయ్‌కుమార్ వివరించారు.

## సహకార బ్యాంకు భవనాన్ని పరిశీలించిన చైర్మన్

పీఏసీఎస్ భవనాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ వెంకట్రామిరెడ్డి

**శివ్వంపేట, అక్టోబర్22 ప్రభాతవార్త:** శివ్వంపేట మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంకు భవనం నిర్మాణ పనులను పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్రామిరెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించారు. పురాతన భవనం స్థలంలోనే నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సహకారంతో మంజూరైన 90 లక్షల వ్యయంతో ఆధునికంగా ఈ భవనాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. మండల పరిధిలోని రైతులకు అన్ని విధాలుగా అవసరమయ్యే విధంగా పీఏసీఎస్ నూతన భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ భవనం నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు చైర్మన్ వెంకట్రామిరెడ్డి, వైస్ చైర్మన్ నాయిని వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పర్యవేక్షిస్తున్నారు. భవనం నిర్మాణ నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని చైర్మన్ వెంకట్రామిరెడ్డి స్పష్టం చేస్తున్నారు. తమ సూచనల ప్రకారంగానే నిర్మాణ పనులు చేపట్టాలని, ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయన వెంట పీఏసీఎస్ బ్యాంక్ సీఈవో మధు, నాయకులు ముద్దగళ్ల లక్ష్మీనర్సయ్య, బొద్దుల భిక్షపతి తదితరులు ఉన్నారు.

## నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం
-మెదక్ జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

**పెద్దశంకరంపేట, అక్టోబర్22 ప్రభాతవార్త:** నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని మెదక్ జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. శనివారం పెద్దశంకరంపేట మండల పరిధిలోని శివాయపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని ప్రారంభించారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల ఎంతగానో ఉపయోగం ఉంటుందన్నారు. శివయపల్లిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన వ్యాపారవేత్త రాజలింగం, గ్రామ సర్పంచి, గ్రామస్థులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ సైదులు, అల్లాదుర్గం సీఐ జార్జ్, ఎస్ఐ బాలరాజు, ఏఎస్ఐ అశోక్, సర్పంచి నరేశ్, ఉప సర్పంచి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ప్రత్యేక పూజలు
**పెద్దశంకరంపేట, అక్టోబర్22 ప్రభాతవార్త:** వేణుగోపాల స్వామి ఆలయ పునర్నిర్మానంలో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మురళి పంతులు దంపతులతో వాస్తు పూజ, పుణ్యాహవచనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్ఛరణలతో పూజా కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు రామచంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా మహాసభలను జయప్రదం చేయడం
కొండాపూర్, అక్టోబర్ 22, ప్రభాతవార్త

నెల 23వ తేదీన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్య కార్యకర్తల ఎం గోపాల్ అన్నాడు. శనివారం మునిదేవునిపల్లి గ్రామంలో జరిగిన సమావేశం ఆయన మాట్లాడుతూ ఈ దేశంలోని వ్యవసాయ కార్మికులు వ్యవసాయం చేసే పరిస్థితి లేదని అన్నారు. ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు సపోర్ట్ చేస్తున్నాయని పేరుకు వ్యవసాయ కార్మికులకు సహకారం అంటూనే వ్యవసాయ కూలీల నడ్డి విరిచే పనులు చేస్తున్నారని అన్నారు. ఉపాధి పనిదినాలు 200 రోజులు పెంచాలి. ప్రతికూలికి రోజుకు కనీస వేతనం 600 రూపాయలు ఇవ్వాలి, అలాగే పనేచేసే చోట మరణించినచో 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని అన్నారు. 23న సదాశివపేటలో జరిగే మహాసభలను వ్యవసాయ కార్మికుల సమస్యలపై పరిష్కారం దిశగా మహాసభల్లో చర్చిస్తారని భవిష్యత్ పోరాటాలకు సిద్ధమవుతారని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆంజనేయులు, కామారెడ్డి, చంద్రయ్య, మణయ్య, నరసింహులు, వెంకన్న పాల్గొన్నారు.

### ఇంధన పార్కుకు పవర్ ట్రాన్స్ ఫార్మర్లను సరఫరా చేస్తున్న హితాచీ ఎనర్జీ
హితాజీ ఎనర్జీ ఇండియా లిమిటెడ్‌కి ఎన్టీపీసీ పునరుత్పాదక ఎన ర్జీ లిమిటెడ్ ద్వారా భారతదేశంలోనే అతిపెద్ద సోలార్ పార్కు లో భాగమైన గుజరాత్‌లో రాబోయే 4.75(జీడబ్ల్యు) మెగావాట్ల పునరుత్పాదక ఇంధన పార్కు కోసం పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను సరఫరా చేయడానికి ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా హితాచీ ఎనర్జీ ఇండియా అండ్ దక్షిణాసియా మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సీఈఓ వేణు మాట్లాడుతూ శిలాజ ఇంధనాల నుంచి పునరుత్పాదక ఇంధనాలకు పరివర్తన ఇప్పుడే ప్రారంభమైందన్నారు.


కాండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బిజెపి నాయకులు

## బిజెపిలో చేరిన గన్యాతండా వాసులు
**నర్సాపూర్,, అక్టోబర్ 22 .ప్రభాతవార్త:** మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామ పంచాయతీ లోగల గన్యాతండాకు చెందిన గిరిజనతండా వాసులు శనివారం నాడు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగాయిపల్లి గోపి, గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, బిజెపి నాయకులు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ అధ్వర్యంలో బిజెపి పార్టీలో చేరారు. ఈసందర్భంగా గన్యాతండాలో బిజెపి పార్టీలో చేరిన తండావాసులు వార్డు సభ్యులు రాంచందర్, మాజీ వార్డు సభ్యులు మోహన్, ధర్మా, శంకర్, రమేష్, చందర్, చందు,బధ్రు, కిషన్, శ్రీను, లాలు తో పాటు సుమారు 35 మంది బిజెపి పార్టీలో చేరారు. ఈమేరకు పార్టీలో చేరిన వారిని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగాయిపల్లి గోపి, గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, బిజెపి నాయకులు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ లుబిజెపి పార్టీ కండువాలు కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్మంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన వారు పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ఈ మండలంలో మరికొంత మంది బిజెపి పార్టీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో బిజెపి పార్టీ పట్ల ప్రజలు ఆకర్షితులై పార్టీలో చేరడం వల్ల మండలంలో బిజెపి పార్టీ మరింత భలోపేతం అవుతుందని అన్నారు. దీంతో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నర్సాపూర్ నియోజకవర్గంలో బిజెపి పార్టీ బలపరిచిన అభ్యర్థి విజయం సాధిస్తాడని వారు అన్నారు. రాబోవు ఎన్నికల్లో నర్సాపూర్‌లో బిజెపి జెండా ఎగురవేయడం ఖాయమన్నా ధీమాను వారు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు పాపగారి చిన్న రమేశ్‌గౌడ్, పట్టణ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, శ్వింపేట మండల అధ్యక్షులు నల్లరవిగౌడ్, మండల ఉపాధ్యక్షులు రాజు, మండల బిజెవైఎం అధ్యక్షులు అనిల్, బిజెపి నాయకులు పోచయ్య, సాయిబాబా, భూత్ అధ్యక్షులు రాజు, బిజెవైఎం కార్యదర్శి వేణు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిలో చేరిన స్టేట్ జెఏసి వైస్ చైర్మన్‌కు సన్మానం

చంది శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానిస్తున్ననర్సాపూర్ బిజెపి నాయకులు

**నర్సాపూర్, అక్టోబర్ 22 .ప్రభాతవార్త:** నర్సాపూర్ పట్టణానికి చెందిన తెలంగాణ స్టేట్ జెఏసి వైస్ చైర్మన్ చంది శ్రీనివాస్‌గౌడ్ ఇటీవల హైద్రాబాద్‌లో మాజీ ఎంపి, బిజెపి నాయకులు భూర నర్సయ్యగౌడ్ సమక్షంలో బిజెపి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బిజెపి పార్టీలో చేరిన చంది శ్రీనివాస్ గౌడ్ ను మాజీ ఎంపి, బిజెపి నాయకులు భూర నర్సయ్యగౌడ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం బిజెపి లో చేరిన చంది శ్రీనివాస్‌గౌడ్ శనివారం నర్సాపూర్‌నకు వచ్చిన సందర్బంగా ఇక్కడి బిజెపి నాయకులు ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు పాపగారి చిన్న రమేశ్‌గౌడ్, బిజెపి పట్టణ అధ్యక్షులు, ఆంజనేయులుగౌడ్ లు ఘన స్వాగతం పల్లి బిజెపి పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది, ఈమేరకు బిజెపి పార్టీలో చేరిన తెలంగాణ జెఏసి వైస్ చైర్మన్ చంది శ్రీనివాస్‌గౌడ్ ను వారు శాలువాలతో సన్మానించడం జరిగింది. ఈకార్యక్రమంలో ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు పాపగారి చిన్న రమేశ్‌గౌడ్, బిజెపి పట్టణ అధ్యక్షులు, ఆంజనేయులుగౌడ్ ల తో పాటు నర్సాపూర్ పట్టణ బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సునీతారెడ్డి పై అసత్య ప్రచారాలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

## పోలీస్ స్టేషన్‌లో టిఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు
**నర్సాపూర్,, అక్టోబర్ 22, ప్రభాతవార్త:** రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి బిజెపి పార్టీలోకి వెళ్తుందని కొందరు సోషల్ మీడియాలో అసత్యపు ప్రచారాలు చేయడం పట్ల శనివారం నర్సాపూర్‌లోని పోలీస్ స్టేషన్‌లో సిఐ షేక్ లాల్ మధార్ కు, ఎస్ఐ గంగరాజు కు టిఆర్ఎస్ నాయకులు పిర్యాధు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి పై అసత్యపు ప్రచారాలు చేసిన వారిని వెంటనే గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఐ షేక్ లాల్ మధార్‌కు, ఎస్ఐ గంగరాజుకు టిఆర్ఎస్ నాయకులు ఇచ్చిన పిర్యాధులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోనర్సాపూర్ మున్సిఫల్ వైస్ చైర్మన్ నహిమొద్దీన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హబీబ్‌ఖాన్, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు బోగ చంద్రశేఖర్, కొంతాన్‌పల్లి సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్,టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పంబళ్ళ బిక్షపతి, నాయకులు కుమ్మరి నాగేశ్, ఆంజనేయులుగౌడ్, రవిగౌడ్ తదితరులు పిర్యాధు చేసిన వారిలో ఉన్నారు.

## పోలీసుల ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు
**నర్సాపూర్,, అక్టోబర్ 22 .ప్రభాతవార్త:** అక్టోబర్ 21 న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నర్సాపూర్ పోలీసుల అధ్వర్యంలో శనివారం నర్సాపూర్‌లోని బివిఆర్ఐటి కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ వ్యాస రచన పోటీలు సైబర్ క్రైమ్ నివారణలో పోలీసులు మరియు ప్రజల యొక్క పాత్ర అనే అంశం పై ఆన్‌లైన్ విదానంలో ఈ వ్యాస రచన పోటీలు నిర్వహించడం జరిగింది కాగా ఈ వ్యాస రచన పోటీల్లో సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలను ఎస్ఐ గంగరాజు పర్యవేక్షణలోజరుగగా విద్యార్థులు వ్యాస రచనపోటీల్లో పాల్గొన్నారు.

## ఖమ్మంపల్లి ప్రాథమిక పాఠశాలను పరిశీలించిన ఎంఈఓ
**మునిపల్లి, అక్టోబర్ 22, ప్రభాతవార్త:** శనివారం నాడు మునిపల్లి మండల విద్యాధికారి దశరథ్ ఎఫ్ఎల్ తొలిమెట్టు పరిశీలన కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక పాఠశాల ఖమ్మంపల్లిని పరిశీలించడం జరిగింది. ఎఫ్ఎల్ఎన్ రిజిస్టర్లు, ఇతర రిజిస్టర్లను పరిశీలించడం జరిగింది. పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అందరివద్ద పీరియడ్ ప్లాన్స్, లెస్సన్‌ప్లాన్స్, టిఎల్ఎంలను చూసి అందరిని అభినందించడం జరిగింది. అదేవిధంగా విద్యార్థుల ప్రగతిని అకాడమిక్ చివరి వరకు అన్ని తరగతులు వందశాతం సామర్థాలను సాధించే విధంగా కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాలు ఎండి ఖంరోద్దిన్, ఉపాధ్యాయులు వినయ్ కుమార్, గోపాల్, ప్రీతి, విద్యార్థులు ఉన్నారు.

## రాహుల్ గాంధీ కాంగ్రెస్ జోడో యాత్రను విజయవంతం చేయాలి
**గుమ్మడిదల, అక్టోబర్ 22, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న జోడో యాత్రను విజయవంతం చేయాలని ఉమ్మడి జిన్నారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మద్ది వీరారెడ్డి, దాసరి శ్రీకాంత్‌రెడ్డి, ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తల సమావేశం ఆదివారం గుమ్మడిదల మండల కేంద్రంలోని ఎంపీ ఆర్ఆర్ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి పటాన్‌చెరువు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్, జిన్నారం ఎంపీపీ డి రవీందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సందర్బంగా మద్ది వీరారెడ్డి మాట్లాడుతూ గుమ్మడిదల జిన్నారం మండలాలలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. నవంబర్ 2 తారీఖున పటాన్‌చెరులో నిర్వహించబోయే జోడో యాత్రలో రాహుల్ గాంధీ పర్యటనను కాంగ్రెస్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్ట నర్సింగరావు, గోవర్ధన్ గౌడ్, మేడిపల్లి మురళి, మద్ది ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

## సిఎస్ఆర్ నిధుల పరయవేక్షణ పకడ్బందీగా జరగాలి : కలెక్టర్
**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 22, ప్రభాతవార్త:** శనివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సిఎస్ఆర్ నిధుల పర్యవేక్షణా కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పరిశ్రమలను 5 క్లస్టర్స్‌గా చేశామన్నారు. సామాజిక బాధ్యతగా జిల్లా అభివృద్ధికి సిఎస్ఆర్ కింద వివిధ అభివృద్ధి పనులను నిధులను కలెక్టర్ ఖాతాలో జమ చేయాలన్నారు. సిఎస్ఆర్ నిధులను రాబట్టడానికి సరైన పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసిన కమిటీ వారి వారికి కేటాయించిన క్లస్టర్‌లోని పరిశ్రమలను పరిశీలించిన నివేదిక అందచేయాలని కలెక్టర్ సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న కంపెనీలకు నోటీసులు జారీ చేయాలన్నారు.


సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజేష్

## సైబర్‌నేరాలు, మోసాల పట్ల అవగాహన కలిగి ఉండాలి
రామాయంపేట ఎస్ఐ రాజేష్

**రామాయంపేట మున్సిపాలిటీ, అక్టోబర్ 22, ప్రభాతవార్త:** విద్యార్థులు సైబర్‌నేరాలు, మోసాల పట్ల ఖచ్చితంగా పూర్తిస్థాయి అవగాహన కలిగిఉండాలని రామాయంపేట ఎస్ఐ రాజేష్ సూచించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో బాగంగా శనివారం నాడు స్థానిక స్నేహ జూనియర్ కళాశాలలో షీ టీం ఆద్వర్యంలో విద్యార్థులకు సైబర్‌నేరాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు ఈ మద్య కాలంలో చాలా ఎక్కువయ్యాయని అందులో ముఖ్యంగా యువకులు, విద్యార్థులే మోసపోతున్నారని అన్నారు. ఈ విషయంలో ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. అంతే కాకుండా విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని అన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. సమాజంలో విద్యార్థి దశ కీలకమని, అందుకే ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలని అన్నారు. ముఖ్యంగా విద్యార్థినీలు ధైర్యంగా ఉండాలని, ఎలాంటి సమస్యలనైనా ఎదుర్కోనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. పోలీస్‌శాఖ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని సూచించారు. ఈ కార్యక్రమంలో షీటీం కానిస్టేబుల్ కిరణ్, సిబ్బందితో పాటు కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్టీసి బస్ డిపోను తనిఖీ చేసిన ఎగ్జిక్యూటీవ్ డైరక్టర్
**నర్సాపూర్, అక్టోబర్ 22 .ప్రభాతవార్త:** నర్సాపూర్ పట్టణంలోని ఆర్టీసి బస్ డిపోను శనివారం ఆర్టీసి ఎగ్జిక్యూటీవ్ డైరక్టర్ పురుశోత్తం నాయక్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ బస్‌డిపోలో ఎన్ని బస్‌లు ఉన్నాయని, ఎంతమంది సిబ్బంది సని చేస్తున్నారని, ఏ ప్రాంతాలకు బస్‌లు వెళ్తున్నాయని స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్టీసి బస్టాండ్‌లో ఉన్న దుకాణ సముదాయాలను పరిశీలించారు. ఈసందర్బంగా ఆయన ఆర్టీసి అధికారులకు పలు సూచనలు, సలహాలను ఇవ్వడం జరిగింది. ఈకార్యక్రమంలోఆర్టీసి రీజినల్ మేనేజర్ సుదర్శన్, డిపో మేనేజర్ రవిచందర్, అసిస్టెంట్ మేనేజర్ నవీన్‌యాదవ్, డిపో ఇంచార్జీ నరేందర్, సిబ్బంది శ్యామ్‌సుందర్, అంబర్‌సింగ్, వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మంజీరా విద్యాలయంలో దీపావళి సంబరాలు

మట్టి ప్రమిదలతో దీపాలు వెలిగిస్తున్న విద్యార్థినిలు

**రామాయంపేట మున్సిపాలిటీ, అక్టోబర్ 22, ప్రభాతవార్త:** రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని మంజీరా విద్యాలయంలో దీపావళి పండుగను విద్యార్థిని, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. శనివారం నాడు వారంతా పాఠశాలలో మట్టి ప్రమిదలలో దీపాలు వెలిగించి సంబరాలు చేసుకున్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయురాలు వాసవి విద్యార్థులకు దీపావళి పండుగ విశిష్టతను తెలియజేశారు. నరకాసురదనే రాక్షసుడి పీడ వీడింది అనే సంతోషంతో ఆ మరుసటి రోజు ప్రజలు సంబరాలు జరుకుంటారని, చీకటిని పారద్రోలుతూ వెలుగులు తెచ్చే పండుగగా ప్రత్యేకంగా దీపావళి పండుగను జరుకుంటాదని తెలిపారు. ఈ పండుగ ప్రతియేటా అశ్వాయుజ అమావాస్య రోజున దేశ ప్రజలంతా జరుపుకుంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పుట్టి సురేష్, కరస్పాండెంట్ జితేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు మౌనిక, శిరీష, వనిత తదితరులు పాల్గొన్నారు.

## హ్యూమన్ రైట్స్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సత్యం ఎన్నిక

కుంట సత్యంకు నియామకపత్రం అందజేస్తున్న జె.ప్రశాంత్

**మర్కుక్, అక్టోబర్ 22 (ప్రభాతవార్త):** హ్యూమన్ రైట్స్ అడ్వైజ్ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామానికి చెందిన కుంట సత్యం నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌టిఐ అండ్ హ్యూమన్ రైట్స్ అడ్వైజ్ సొసైటీ ఫౌండర్ జె.ప్రశాంత్ చేతులమీదుగా హైదరాబాద్‌లో నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుంట సత్యం మాట్లాడుతూ నాపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ చైల్డ్ ప్రొటక్షన్ కమిటీ రాష్ట్ర సభ్యుడు కుసుమ, కవిత, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఓపెన్‌హౌజ్ నిర్వహించిన ఎస్ఐ హరీష్‌గౌడ్
మర్కుక్, అక్టోబర్ 22 (ప్రభాతవార్త): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా శనివారం మర్కుక్ ఎస్ఐ హరీష్‌గౌడ్ ఆధ్వర్యంలో కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాల విద్యార్థినిలకు ఓపెన్‌హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ శాఖకు సంబంధించి ఆయుధాలు, పరికరాలు, కమ్యూనికేషన్, రికార్డులను, పోలీసుల విధివిధానాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ హరీష్‌గౌడ్ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఓపెన్‌హౌజ్ కార్యక్రమంతో విద్యార్థులకు పోలీసులు నిర్వహిస్తున్న శాంతిభద్రతల పట్ల అవగాహన ఉండేందుకు, వ్యాసరచన పోటీసులను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బాల్‌రాజు, పోలీస్ సిబ్బంది కృష్ణ, కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ హరీష్‌గౌడ్

## రైలుక్రింద పడి యువకుడి మృతి
**రామాయంపేట మున్సిపాలిటీ, అక్టోబర్ 22, ప్రభాతవార్త:** రైలుక్రిందపడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన రామాయంపేట మండలం ఝాన్సీలింగాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. మృతుని కుటుంబ సభ్యుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన తిప్పాపూర్ నరేష్‌గౌడ్ (28) అనే యువకుడు చిన్న శంకరంపేట మండలం సంకాపూర్ గ్రామంలో ఉన్న తమ బంధువుల ఇంటికి వెళ్లాడు. శనివారం తెల్లవారుజామున వాకింగ్ చేస్తూ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారం దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మరిణించినట్లు తెలిపారు. అందరితో ఎంతో కలుపుగోరుగా ఉండే నరేష్ గౌడ్ రైలు ప్రమాదంలో మృతిచెందడంతో ఝాన్సీలింగాపూర్ గ్రామంలో విషాధఛాయలు అలుముకున్నాయి. మృతుని కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్తులు కోరారు.

## జలాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు,అన్నదానం
**నర్సాపూర్, అక్టోబర్ 22 .ప్రభాతవార్త:** నర్సాపూర్ మెదక్ ప్రధాన రోడ్డులోని పెద్దచింతకుంట గ్రామ శివారులో వెలిసిన జలహనుమాన్ ఆలయంలోశనివారం శ్రీజలాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ వడ్ల సుదాకర్‌చారి అధ్వర్యంలో నిర్వహించడం జరిగింది, ఈమేరకు అన్నదానం, పూజా కార్యక్రమాలు భక్తులు భక్తి శ్రద్దలతో నియమ నిష్టలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ పూజారి రాధాకృ ష్ణాశర్మ, శివ,రాజు పంతుళ్ళ అధ్వర్యంలో వేద మంత్రాల మధ్యన జలాంజనే యస్వామికి అభిషేకం, చందన లేపనం, వంటి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ వడ్ల సుధాకర్‌చారి హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. ఈమేరకు మధ్యాహ్నం ఆలయ కమిటీ నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని అన్నదానాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కవడ్ల సుధాకర్‌చారి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## తడిచెత్త, పొడిచెత్త వేరుచేసి ఇవ్వాలి
-3వ వార్డు కౌన్సిలర్ మర్కంటి వరలక్ష్మికనకయ్య


తడిచెత్త, పొడిచెత్తపై అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ వరలక్ష్మికనకయ్య

**గజ్వేల్, అక్టోబర్ 22 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో తడి చెత్త, పొడి చెత్త, హానికర చెత్తపై శనివారం 3వ వార్డులో స్థానిక కౌన్సిలర్ మర్కంటి వరలక్ష్మికనకయ్య ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా మున్సిపల్ సిబ్బందికి అందించాలన్నారు. మున్సిపల్ సిబ్బంది మీకు ఇచ్చిన బుట్టలలో తడి, పొడి, హానికర చెత్తను వేరుచేసి వేయాలన్నారు. ఇప్పటికే ప్రజలందరికీ తడి, పొడి చెత్తపై అవగాహన వచ్చిందని, 80 శాతం ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరిస్తున్నారని, అందరూ ఇలాగే సహకరిస్తే గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ స్వచ్ఛ మున్సిపాలిటీగా మారుతుందన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ మండల యాదవ సంఘం అధ్యక్షుడు కొనమైన కన్నాయాదవ్, 3వ వార్డు అధ్యక్షుడు శ్రీరాం మల్లేశం, పట్టణ ఉపాధ్యక్షుడు కదుల్ల ఎల్లేశం, మున్సిపల్ సిబ్బంది, వార్డు మహిళలు పాల్గొన్నారు.

## 4వ వార్డులో పర్యటించిన గడా ప్రత్యేకాధికారి
**గజ్వేల్, అక్టోబర్ 22 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 4వ వార్డులో గడా ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, కమిషనర్ విద్యాధర్‌లు పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ పంబాల అర్చనశివకుమార్ వార్డులో ఉన్న పలు సమస్యల గురించి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వార్డులలో సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం గడా అధికారి ముత్యంరెడ్డి మాట్లాడుతూ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అభివృద్ధిలో శరవేగంగా దూసుకుపోతుందని, గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎన్నో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి జరుగుతుందని, వంద కోట్లతో అండర్ డ్రైనేజీ నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో అండర్ డ్రైనేజీ నిర్మాణం పనులు పూర్తవుతుందని, అన్ని వార్డుల్లో సిసి రోడ్లు ఏర్పాటు చేయిస్తామన్నారు. వారి వెంట మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## భారత్ జోడో యాత్రను విజయవంతం చేయాలి

వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న దామోదర రాజనర్సింహ్మా

**గజ్వేల్, అక్టోబర్ 22 (ప్రభాతవార్త):** భారత్ జోడో యాత్ర తెలంగాణ రాష్ట్రంలోకి విచ్చేయుచున్న సందర్బంగా రాహుల్‌గాంధీ పాదయాత్రను విజయవంతం చేయాలని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి రాచకొండ ప్రశాంత్ పేర్కొన్నారు. శనివారం రాహుల్‌గాంధీ పాదయాత్ర సందర్బంగా ఏర్పాటుచేసిన వాల్‌పోస్టర్లను గాంధీభవన్‌లో మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ్మా, మాజీ కేంద్ర మంత్రి బలరాంనాయక్, మాజీ పార్లమెంట్ సభ్యుడు పొన్నం ప్రభాకర్, పిసిసి కార్యనిర్వాహక అధ్యక్షుడు బొమ్మ మహేష్‌గౌడ్, మాజీ ఎంపి రాజయ్య, మెట్టు సాయిలు చేతులమీదుగా విడుదల చేశారు. ఎన్ఎస్‌యుఐ నాయకులు, కార్యకర్తలు రాహుల్‌గాంధీ పాదయాత్రలో పాల్గొని భారత్ జోడో యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర నాయకులు దేవులపల్లి కర్ణాకర్‌గౌడ్, సుమన్, అక్షయ్, బాలకిషన్, సంపత్, అభిషేక్, భాను, కరుణాకర్, వంశీ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలి
-గౌరారం ఎస్ఐ సంపత్‌కుమార్

**వర్గల్, అక్టోబర్ 22 (ప్రభాతవార్త):** ఆటో డ్రైవర్లు అందరూ డ్రైవింగ్ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని గౌరారం ఎస్ఐ సంపత్‌కుమార్ సూచించారు. శనివారం వర్గల్ మండలంలోని ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సంపత్ కుమార్ మాట్లాడుతూ ఆటోలు నడిపించే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి వుండాలన్నారు. ఆటోలకు ఫిట్‌నెస్‌తో పాటు ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. నిబంధనలు పాటించని ఆటో డ్రైవర్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### విద్యార్థులకు ఓపెన్‌హౌజ్
పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం గౌరారం పోలీస్‌స్టేషన్‌లో స్థానిక డెక్కన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు ఓపెన్‌హౌజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సంపత్‌కుమార్ విద్యార్థులకు పోలీస్‌స్టేషన్‌లోని రిసెప్షన్, సెక్షన్ ఇన్‌ఛార్జి, సిసిటివి, రికార్డ్స్ తదితర వాటి గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పొదుపు సంఘాలను పటిష్టం చేయాలి
**కంగ్టి, అక్టోబర్ 22, ప్రభాతవార్త:** కంగ్టి మండల కేంద్రంలోని స్థానిక ఐకెపి కార్యాలయంలో శనివారం మండల సమైక్య సమావేశం అధ్యక్షురాలు ఆలూరే మహానందం అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండల ఐకెపి ఏపీఎం ధనరాజ్‌గిరి, డిఎంజి నర్సప్పలు పొదుపు సంఘాలతో సమీక్ష నిర్వహించారు. అంతకుముందు మండల సమైక్య నిబంధన ప్రకారం ప్రార్థన కార్యక్రమం చేపట్టారు. గ్రామాల్లో పొదుపు సంఘాల లావాదేవీలు, బ్యాంకు లింకేజీ రుణాలు, రికవరీ, స్త్రీనిధి వినియోగం పట్ల చర్చించారు.



ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీపీ

## పరేడ్ మైదానంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం ప్రారంభం

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం(ఫ్లాగ్ డే) కార్యక్రమంలో భాగంగా శనివారం సీపీ కార్యాలయంలోని పెరేడ్ మైదానంలో సీపీ శ్వేత ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీపీ శ్వేత స్వయంగా విద్యార్థులకు అయుధాల పనితీరు పోలీసు చట్టాలు, సీసీ కెమెరాలు వలన కలిగే లాభాలు, డాగ్ సా ్వడ్, ఫింగర్ ప్రింట్, డివైస్, ట్రాఫిక్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడి ్మన్ సందెపొగు మహేందర్, డీసీపీలు రామచంద్రారావు, సుభాష్ చంద్రబోస్, ట్రాఫిక్ ఏసీపీ ఫణిందర్, పోలీసు అధికారులు శ్రీధర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ధరణికుమార్, రామకృష్ణ, శ్రీకాంత్, తిరు పతి, కార్తీక్, రోహిత్, సురేష్, సాయిప్రసాద్, అభిలాష్, బాలయ్య, సిద్దిపేట ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ అధ్యక్షులు జగ్గు మాల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫీజుల పెంపును నిరసిస్తూ ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం



ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దృశ్యం

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం వృత్తి విద్య ఇంజనీరింగ్ ఫీజుల పెంపు నిర్ణయం పేద విద్యార్థులను ఉన్నత విద్యాకు దూర ం చేయడమేనని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మన్నె కుమార్ అన్నారు. ఇంజనీరింగ్ ఫీజుల పెంపు ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా శాఖ అధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన ఫీజులు విద్యార్థులకు శాపంగా మారనున్నాయన్నారు. పెంచిన ఫీజుల నిర్ణయం వెంటనే వెనక్కు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్‌తో పాటు స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేసిన ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో అందోళనలు చేస్తామన్నారు. ఒగ్గు రమేష్, అప్పాల కృష్ణ, సాయికుమార్, ప్రవీణ్, వెంకటేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## రూ.399తో రూ.10 లక్షల ప్రమాద బీమా

**తపాల సేవలపై గ్రామస్తులకు అవగాహన**



తపాల బీమాపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**బెజ్జంకి, అక్టోబర్ 22, ప్రభాతవార్త :** మండల పరిధిలోని వీరాపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ అవరణలో శనివారం తోటపల్లి తపాలా శాఖ అధ్వర్యంలో తపాల సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ పోస్ట్ మాస్టర్ సి.హెచ్.కుమారస్వామి మాట్లాడుతూ యేడాదికి ఒకసారి రూ.399లతో రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తు_ందన్నారు. 18 యేండ్ల నుంచి 65 యేండ్ల వయస్సు కలిగిన వారు ఎవరైనా ఈ బీమా పాలసీకి అర్హులన్నారు. ప్రమాదంలో మరణించిన, శాశ్వత వైకల్యం, అవయవం కోల్పోయినా, పక్షవాతం వచ్చినా తపాలాశాఖ నుంచి రూ.10 లక్షలు చెల్లిస్తారని తెలిపారు. ఏదైనా ప్రమాదం జరిగి పాలసీ తీసుకున్న వ్యక్తి వైద్యం కోసం అసుపత్రిలో చేరితో ఐపీడీ కింద రూ.60 వేలు, ఔట్ పేషెంట్‌కు రూ.30 వేలు చెల్లిస్తారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సుధీర్‌రావు, తపాలా సిబ్బంది శ్రీధర్, విజయ్, శ్రీకాంత్, స్వామి, బాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్‌బిఐ ఆఫీసర్స్ అసోసియేషన్ సమావేశం

**కొండపాక, అక్టోబర్ 22, ప్రభాతవార్త :** స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా అఫీసర్స్ అసోసియేషన్ హైదారాబాద్ సర్కిల్ సిద్దిపేట రీజినల్ సమావేశం శనివారం మండల పరిధిలోని దుద్దెడ మినర్వా హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు అప్పస్వామి, ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌లు మాట్లాడుతూ అఫీసర్ యొక్క వేతన సవరణనను, ఐదు రోజుల పని దినములపై సభ్యులకు వివరించారు. పెన్షన్ సవరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట ఎస్‌బిఐ రీజినల్ మేనేజర్ సత్య నీరజ, డిప్యూటీ జనరల్ కార్యదర్శి అంజనేయ ప్రసాద్, హైదారాబాద్ ఏవో డిజిఎస్ విక్రమ్, వరంగల్ ఏవో శంకర్, అఫీసర్స్ సిద్దిపేట, ఇతర జిల్లాల అఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

## కేరళ స్కూల్స్‌లో ముందస్తు దీపావళి వేడుకలు

**హుస్నాబాద్, అక్టోబరు22, ప్రభాతవార్త:** హుస్నాబాద్ పట్టణంలోని కేరళ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం రోజున ముందస్తు దీపా వళి వేడుకలను పాఠశాల కరస్పాండెంట్ అల్లి శైలేందర్, ప్రిన్సిపాల్ బుర్ర రాజేందర్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాలలో దీపాలు వెలిగించి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజే ందర్ మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ దీపావళి వేడుకలు జరుపుకుంటారని సూచించారు. పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

### కిసాన్ సంఘ్ మండల కార్యదర్శిగా అనంతస్వామి

**హుస్నాబాద్, అక్టోబరు22, ప్రభాతవార్త:** భారతీయ కిసాన్‌సంఘ్ హుస్నాబాద్ మండల కార్యదర్శిగా వరియోగుల అనంతస్వామిని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు జస్వంత్‌రెడ్డి శనివారం రోజున ఉత్తర్వు లు జారీ చేశారు. ఈ సందర్భంగా అనంతస్వామి మాట్లాడుతూ తన పై నమ్మకంతో తనకు మండల కార్యదర్శిగా అవకాశం కల్పించిన జిల్లా, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

### షాప్‌టుగివ్ ప్రారంభించిన మిలాప్

ఈ పండుగ సీజన్‌లో భారతదేశపు మొట్టమొదటి జీరో–ఫీక్రౌడ్ ఫండింగ్ వేదిక మిలాప్ డాట్ ఓఆర్‌జీ తమ తాజా ఆఫరింగ్ షాప్‌టు గివ్‌ను ప్రారంభించింది. ఆన్‌లైన్ గివింగ్‌ను వైవిధ్యీకరిం చడంతో పాటు గా తమ ప్రయత్నాలను మెరుగ్గా కొనసాగిండంలో భాగంగా ఈ సౌక ర్యం ప్రారంభించింది. ఈ సందర్భంగా మిలాప్ కౌ–ఫౌండర్ అధ్యక్షుడు అనోజ్ విశ్వనాథ్ మాట్లాడుతూ మిలాప్ వద్ద తాము స్థిరంగా తమ క్యాంపెయిన్ ఆర్గనైజర్లు విజయ వంతంగా విరాళాలను సేకరించేందుకు తగిన అవకాశాలను అందించడానికి కృషి చేస్తూనే ఉంటామన్నారు.



ఒకటవ వార్డు ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## తడిపొడి చెత్తపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి

**మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న**

**హుస్నాబాద్, అక్టోబరు22, ప్రభాతవార్త :** తడిపొడి చెత్తలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న అన్నారు. శనివారం రోజున పట్టణంలోని 1,3,17,20వ వార్డుల్లో కౌన్సిలర్లు కొంకటి నళినిదేవి రవి, వల్లపు రాజు, వాల సుప్రజ నవీన్‌రావుల ఆధ్వర్యంలో ప్రజలకు తడిపొడి చెత్తలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయగా ముఖ్యఅతిధిగా హాజరాయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని సిద్దార్థ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులకు చెత్త ద్వార కలిగే నష్టాలను వివరించారు. తడి చెత్తతో ఇండ్లలోనే కంపోస్టు ఎరువులు తయారు చేసుకుని ఇంట్లో మొక్కలకు వాడుకోవడం వల్ల మొక్కలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. ప్రతీ విద్యార్థి తమ ఇండ్ల ముందు తడి, పొడి ,హానికరమైన చెత్త గురించి చిత్రపటాలు గీసి తమ ఇండ్ల ముందు అంటించి సెల్ఫీలు తీసి వాట్సప్ గ్రూపులలో పెట్టడం వల్ల ఇతరులకు కూడా అవగాహన కల్పించిన వారవుతారన్నారు. ప్రతీ ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు భూక్య సరోజన, మాజీ ఎంపిపి ఆకుల వెంకట్ కో ఆప్షన్ సభ్యులు శంకర్‌రెడ్డి, ఎండి అయూబ్, కమిషనర్ సుంకె రాజమల్లయ్య, అధికారులు నాగరాజు, జాలిగం శంకర్, రవికుమాం, కోటితో పాటు సిద్దార్థ పాఠశాల కరస్పాండెంట్ ఏనుగు రాధాదేవి, ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి అధ్యాపక బృధం తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన ఫీజుల జీవోను వెనక్కి తీసుకోవాలి

**-ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జనార్ధన్**



రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న జనార్ధన్

**హుస్నాబాద్, అక్టోబరు22, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఇంజనీరింగ్, వృత్తి విద్య కోర్సుల ఫీజులు పెంచినట్లు ఇచ్చిన జీవోను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జేరిపోతుల జనార్ధన్ డిమాండ్ చేశారు. శనివారం రోజున ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో పెంచిన ఫీజుల జీవోను వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీటెక్, ఎంటెక్, ఎంబిఏ ఫీజులను గత ఫీజుల కుంటే భారీగా పెంచి విద్యార్థులకు మోయలేని భారం మోపిందని, కరోనా తర్వాత విద్యార్థుల తల్లితండ్రులు ఉన్న ఫీజులనే చెల్లించలేని స్థితిలో ఉంటే ప్రస్తుతం ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో విద్యార్థుల తల్లితండ్రులను ఆందోళనకు గురిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ తీరును చూస్తుంటే ప్రయివేట్ కళాశాలలకు కొమ్ముకాస్తున్నట్లు ఉందని మండిపడ్డారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం వల్ల పేదమధ్య తరగతి విద్యార్థులు ఇంజనీరింగ్ విద్యకు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొందని, ప్రభుత్వం వెంటనే ఫీజుల పెంపు జీవోను వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులతో కలసి ఆందోళనలు నిర్వహించడంతో పాటు ఉన్నత విద్యామండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అరుణ్, శ్రీను, వేణు, రమేష్, శిరీష, శైలజ, వాణి, రజితతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు వ్యవస్థాపకులుగా ఎదగాలి

**-ములుగు ఫారెస్ట్ కళాశాల డీన్ ప్రియాంకవర్గీస్**



ములుగు ఫారెస్ట్ యూనివర్సిటీ పేపర్ క్రాఫ్ట్, ఆవుపేడ మట్టితో తయారుచేసిన దీపంతలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

**ములుగు, అక్టోబర్ 22 (ప్రభాతవార్త):** యువత ఉద్యోగాల కోసం వేచిచూసి సమయాన్ని వృధా చేయకుండా తమ కాళ్ళపై తాము నిలబడి వ్యవస్థాపకులుగా ఎదిగి మరొకరికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదిగే దిశగా ఆలోచనలు చేయాలని ములుగు ఫారెస్ట్ కళాశాల డీన్, సిఎం ఓఎస్‌డి ప్రియాంకవర్గీస్, ప్రొఫెసర్ శ్రీనిధిలు పేర్కొన్నారు. భారత ప్రభుత్వ సంస్థ మహాత్మ గాంధీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ నుండి నవంబర్ 19వ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహాత్మగాంధీ నేషనల్ వ్యవస్థాపకత నెలలో భాగంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువతకు వివిధ రకాల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం ములుగు మండలకేంద్రంలోని అటవీ కళాశాల మరియు పరిశోధన సంస్థలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్ఎస్.శ్రీనిధి పర్యవేక్షణలో పేపర్ క్రాఫ్ట్, ఆవుపేడ మరియు మట్టితో తయారుచేసిన దీపావళి దీపంతలు, కొవ్వొత్తులు దీపావళి డెకరేషన్ ఫ్లవర్స్‌ను ప్రదర్శించి కళాశాల డీన్, సిఎం ఓఎస్‌డి ప్రియాంకవర్గీస్‌కు బహుమతిగా ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల డీన్ ప్రియాంకవర్గీస్ మాట్లాడుతూ విద్యార్థులు వినూత్నంగా ఆలోచించి వివిధ రకాల ఉత్పత్తులు ప్రత్యేకించి దీపావళి రోజున ఉపయోగించే పర్యావరణ హిత దీపంతలు తయారు చేయడం ఆనందంగా ఉందని, అటవీ కళాశాల అటవీ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి క్షణం పనిచేస్తుందన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడం మనందరి బాధ్యత అని అన్నారు. దీపావళి రోజున టపాకాయలు కాల్చి గాలి, శబ్ద కాలుష్యం చేసి జీవరాశుల ప్రాణాలకు హాని చేయవద్దని ఆమె అన్నారు.

## జిల్లాలో 20వేల ఎకరాల్లో ఆయిల్‌ఫామ్ సాగు లక్ష్యం

**-జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్**

**గజ్వేల్, అక్టోబర్ 22 (ప్రభాతవార్త):** ఆయిల్‌ఫామ్ సాగుతో రైతులకు అధిక ప్రయోజనం ఉంటుందని, జిల్లాలో 20వేల ఎకరాల విస్తీర్ణంలో పంటను సాగు చేసేందుకు ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ పేర్కొన్నారు. శనివారం గజ్వేల్ పట్టణంలోని ఐఓసీ కార్యాలయంలో జిల్లా ఉద్యానవన అధికారి రామ లక్ష్మి, ఏడిఏ బాబునాయక్‌తో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ, రైతు సమన్వయ సమితిలు సంయుక్తంగా రైతులను చైతన్యం చేస్తూ ఆయిల్‌ఫామ్ పంట సాగు వైపు మళ్ళిస్తున్నట్లు స్పష్టం చేశారు. సాగుకు సరిపడా ఆయిల్‌ఫామ్ మొక్కలు సిద్ధంగా ఉంచగా, ప్రతి ఎకరాకు ప్రభుత్వం 40వేల రూపాయల సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. దేశానికి అవసరమయ్యే నూనెలను అంతర్జాతీయ మార్కెట్ నుండి 60 శాతం దిగుమతి చేసుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా నాలుగు సంవత్సరాలలో పంట దిగుబడి రానుండగా అప్పటి వరకు అంతర పంటలుగా మొక్కజొన్న, వేరుశనగ, అరటి, బొప్పాయి తదితర పంటలు వేయవచ్చన్నారు. ఇతర పంటలతో పోల్చితే తెగుల్లు, చీడపురుగులు, తుఫాన్, వడగండ్ల బాధలు ఉండవన్నారు. ఆయిల్‌ఫామ్ పంట సమర్థవంతంగా తట్టుకుంటుందని, లాభాలు ఎక్కువగా వస్తాయని, రైతులందరూ ఆయిల్‌ఫామ్ సాగుకు మొగ్గు చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏఓ నాగరాజు, వ్యవసాయాధికారులు వెంకటరమణి, నాగేందర్‌రెడ్డి, ప్రియదర్శిని, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్



ప్రచారం నిర్వహిస్తున్న బిజెపి నాయకులు

## మునుగోడులో బిజెపి నాయకుల ప్రచారం

**మిరుదొడ్డి, అక్టోబర్ 22, ప్రభాతవార్త :** దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అదేశాల మేరకు సంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షులు దేవరాజు అధ్వర్యంలో శనివారం మునుగోడు బిజెపి అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఇంటింటా ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. మునుగోడులో బిజెపి అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి గెలుపు ఖాయమన్నారు. రాజగోపాల్‌రెడ్డి రాజీనామాతో మునుగోడు నియోజకవర్గంలో ఎన్నో యేండ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులను మోక్షం లభిస్తుందన్నారు. ఈ ఎన్నిక కెసిఅర్ పాలనకు అంతం పలికే ఎన్నిక అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తోట భూపాల్‌రెడ్డి, రంగసమైన కుమార్, వజపల్లి తిరుపతి, మరిపెద్ది నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాదుగుల చెరువులోకి చేప పిల్లలు



చెరువులో చేప పిల్లలను వదులుతున్న దృశ్యం

**కోహేడ, అక్టోబర్ 22, ప్రభాతవార్త :** కోహేడ మండల కేంద్రంలోని బాదుగుల చెరువులో ప్రభుత్వం మత్స్యకార్మికులకు ఉచితం అందించే చేప పిల్లలను శనివారం పిఎసిఎస్ చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు, ఎంపిటిసి ఖమ్మం స్వరూప వెంకటేశం చేతుల మీదుగా 42 వేల చేప పిల్లలను వదిలారు. చేపల పెంపకంతో మత్స్యకార్మికులకు జీవనోపాధి లభిస్తుందన్నారు. బొత్సలు, మెరిగే, బంగారుతీగ చేప పిల్లలను వదిలారు. కార్యక్రమంలో మత్స్య పరిశ్రమ ఎఫ్ఎఫ్ఓ గౌతమి, బిజెపి మండల పార్టీ అధ్యక్షులు ఖమ్మం వెంకటేశం, మత్స్య పరిశ్రమ ఫషర్ మెన్ యాదగిరి, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు దానబోయిన రాజయ్య, కుల పెద్దలు ఎడ్ల రాంచంద్రం, సంఘం నాయకులు తెలు యాదగిరి, దానబోయిన వెంకటస్వామి, బొడిగే సంజీవ్, ఎడ్ల పోచయ్య, గుల్లా కిష్టయ్య, ఎడ్ల చంద్రయ్య, గుల్లా కిషన్, దానబోయిన కిష్టస్వామి, గ్రామ పంచాయతీ కారోబార్ తలారి అనిల్, అఫీస్ బాయ్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్ పోటీలలో ఇంటర్ విద్యార్థుల విజయకేతనం



విజయం సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 22, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి అర ్చన అండర్ 18 ఉమెన్స్ 200 మీటర్స్ రన్నింగ్ విభాగంలో తృతీయ స్థానం సంపాదించి కాంస్య పతకం గెలుచుకుంది. జి.నితిన్ హామర్ త్రో అండర్ 18 విభాగంలో ద్వితీయ బహుమతి గెలుచుకుని రజత పథకం సాధించారు. విజేతలుగా నిలిచిన వారిని కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణరెడ్డి అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు. అలాగే కళాశాల గేమ్స్ కోచ్ వెంకటేష్, అధ్యాపకులు సుధాకర్‌రెడ్డి, విష్ణువర్ధన్, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరమణ, రఘురాజు, విజయభాస్కర్, గంగాధర్, ప్రసాద్ తదితరులు విజేతలను అభినందించారు.

## కొమురంభీం సేవలు మరువలేము



పాఠశాలలో కొమురంభీం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

**మర్కుక్, అక్టోబర్ 22 (ప్రభాతవార్త):** తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి కొమురంభీం జయంతి సందర్భంగా మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం కొమురంభీం చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలకిషన్, ప్రధాన కార్యదర్శి నోరు భాస్కర్‌లు పాఠశాలలోని 210 మంది విద్యార్థినీ, విద్యార్థులకు నోటుబుక్స్, పెన్నులు, స్టూడెంట్ ఐడి కార్డులను స్థానిక సర్పంచ్ లక్ష్మిరాములుగౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓంకార్‌రాధాకృష్ణ, మండల విద్యాధికారి భాస్కర్‌రెడ్డి చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొమురం భీమ్ జయంతి రోజున ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మా అసోసియేషన్ ద్వారా చేయూతనందించడం సంతోషంగా ఉందన్నారు. అంగడికిష్టాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాధాకృష్ణ రాష్ట్ర స్థాయి, ఉపాధ్యాయుడు రామకృష్ణారెడ్డి జిల్లా స్థాయి ఉత్తమ అవార్డులు అందుకోవడం, పాఠశాల జిల్లా స్థాయిలో ఆదర్శంగా ఉండడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠ శాల యాజమాన్య కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు, విద్యార్థు లు పాల్గొన్నారు.

## గల్ఫ్ నుండి స్వగ్రామానికి చేరుకున్న నర్సింలు మృతదేహం

**దుబ్బాక, అక్టోబర్ 22, ప్రభాత వార్త:** దుబ్బాక పట్టణానికి చెందిన జనగామ నర్సింలు(38) బతుకు తెరువుకై గల్ఫ్ దేశానికి వలస వెళ్ళాడు. బహిరాన్‌లో పని చేస్తున్న క్రమంలో గత నెల 25న రోడ్డు ప్రమాదం కాగా వైద్యం పొందుతూ 28న మృతి చెందడం జరిగింది. నర్సింలు మృత దేహం శనివారం స్వగ్రామం చేరుకోవాడంతో కుటుంబికులు, బంధువులు, గ్రామస్తులు ఒక్కసారిగా శోక సముద్రంలో మునిగారు. మృతునికి భార్య కవిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నర్సింలు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

### పోలీసు విధులపై విద్యార్థులకు అవగాహన

**ములుగు, అక్టోబర్ 22 (ప్రభాతవార్త):** పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ములుగు పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్‌హౌజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రంగ కృష్ణ విద్యార్థులకు పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల విధులు, ఎఫ్ఐఆర్ నమోదు, తుపాకుల వివరాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయ న మాట్లాడుతూ విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగం మరువలేనిదని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి వుండాలని సూచించారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతమైన ఉద్యోగాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. పోలీస్ సిబ్బంది, ములుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## సోమవారం ప్రజావాణి రద్దు

**జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్**

సిద్దిపేట రూరల్, అక్టోబర్ 22, ప్రభాతవార్త : దీపావళి పర్వదినం సందర్భంగా ఈనెల 24న సోమవారం ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించడంతో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. సోమవారం ప్రజావాణి రద్దు చేసినందున ప్రజావాణి కార్యక్రమం కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఎవరు రావొద్దన్నారు.

## గోపాల్‌కిషన్‌రావు కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి



బాధిత కుటుంబీకులను పరామర్శిస్తున్న మంత్రి హరీష్‌రావు

**బెజ్జంకి, అక్టోబర్ 22, ప్రభాతవార్త :** మండల పరిధిలోని తోటపల్లి గ్రామ మాజీ సర్పంచ్, టిఆర్ఎస్ పార్టీ నాయకులు పొన్నమనేని గోపాల్‌కిషన్‌రావు సతీమణి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా శనివారం రాష్ట్ర అర్థిఖ, అరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు హైదారాబాద్‌లో బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు.

## అకస్మికంగా పాఠశాలను సందర్శించిన డీఈఓ

**బెజ్జంకి, అక్టోబర్ 22, ప్రభాతవార్త :** మండల పరిధిలోని వీరాపూర్, బేగంపేట గ్రామాల్లో గల ప్రాథమిక పాఠశాలలను శనివారం జిల్లా విద్యాధికారి ఈ. శ్రీనివాస్‌రెడ్డి అకస్మికంగా సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి పఠనాశక్తిని పరిశీలించారు. అలాగే పాఠశాలల్లో సదుపాయాలు, సిబ్బంది కొరత వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మునీరుద్దీన్, సంపత్ తదితరులు ఉన్నారు.

## దోస్త్ ఆన్‌లైన్ అవకాశం కల్పించాలి

**చేర్యాల, అక్టోబర్ 22, ప్రభాతవార్త:** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2022-23 సంవత్సరంకు సంబంధించి దోస్_ డిగ్రీ అడ్మిషన్ పొందుటకు దోస్తు ఆన్‌లైన్ అవకాశం కల్పించాలని మండలంలోని విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్ డి.హేమలత, కో-అర్టినేటర్ నాగేంద్రరావుకు శనివారం వినతి ప త్రం అందించారు.

## పోలీసు స్టేషన్ విధులపై విద్యార్థులకు అవగాహన

**బెజ్జంకి/మిరుదొడ్డి, అక్టోబర్ 22, ప్రభాతవార్త :** పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ అవుల తిరుపతి అధ్వర్యంలో మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా పోలీసు విధులు, 100 నెంబర్ ప్రాధాన్యత, పోలీసుల పనితీరు, కేసుల నమోదు వంటి పలు అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అవుల తిరుపతి మాట్లాడుతూ విద్యార్థులు చదువులో పాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది కొమురయ్య, యూనిస్‌భేగ్‌చ, నరేష్, అశోక్, శ్రీనివాస్, సౌజన్య, మౌనిక, పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### మిరుదొడ్డిలో..

పోలీసు అమరవీరుల దినోత్సవం పరస్కరించుకొని మిరుదొడ్డి మండలం అక్బర్‌పేట–భూంపల్లి పోలీసు స్టేషన్‌లో సీఐ కృష్ణ అదేశాల మేరకు ఎఎస్ఐలు బిక్కు నాయక్, రవీందర్, బాల మల్లేశం అధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యాక్రమాన్ని నిర్వహించారు. పోలీసు అమరవీరుల దినోత్సవంలో భాగంగా పాఠశాల విద్యార్థులు పోలీసు స్టేషన్‌లో అమర పోలీసులకు నివాళులర్పించారు. అనంతరం పోలీసు సిబ్బంది వృత్తిరీత్యా అమరులైన పోలీసు అమరవీరుల త్యాగాలను విద్యార్థులకు వివరించారు. ఓపెన్ హౌస్‌లో పోలీసుల పనితీరు, కేసుల నమోదు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

## పశువులకు వ్యాధులు రాకుండా టీకాలు వేయించాలి

**మండల పశువైద్యాధికారి విజయ్ భార్గవ్**

**హుస్నాబాద్, అక్టోబరు22, ప్రభాతవార్త**

పశువులకు ముద్ద చర్మ వ్యాదులు రాకుండా రైతులు ముందస్తు టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి విజయ్ భార్గవ్ అన్నారు. శనివారం రోజున హుస్నాబాద్ మండలంలోని మాలపల్లి గ్రామంలో పశువులకు ముద్దచర్మ వ్యాధి రాకుండా వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో 271 పశువులకు టీకాలు వేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు మండలంలో పశువులకు ముద్ద చర్మ వ్యాధి సోకలేదని ఒక వేల సోకినట్లు రైతులకు అనుమానాలు ఉంటే వెంటనే పశువైద్యాధికారులకు సూచించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బత్తుల మల్లయ్య, పాలకేంద్రం అధ్యక్షులు సంజావ్, హుస్నాబాద్ మండల సహాయ సంచాలకులు వెంకట్‌రెడ్డి, వైద్య సిబ్బంది క్రాంతి, కిరణ్, ఉమానాయక్, బుచ్చయ్య, రవితో పాటు పాల్గొన్నారు.

## మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**అక్కన్నపేట, అక్టోబరు22, ప్రభాతవార్త**

మత్స్యకారులను ఆర్థికంగా నిలబెట్టాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని చౌటపల్లి గ్రామ సర్పంచ్ గద్దల రమేష్ అన్నారు. శనివారం రోజున అక్కన్నపేట మండలంలోని చౌటపల్లి కొత్త చెరువులో 41వేల చేపపిల్లలను వొదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు మత్స్యకారులను విస్మరించాయని, ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రభుత్వం మిషన్ కాకతీయ కార్యక్రమం ఏర్పాటు చేసి చెరువుల పూటిక తీసి చెరువుల్లో నీటిని నింపడంతో పాటు ఉచితంగా మత్స్యకారులకు చేపపిల్లలు పంపిణీ చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో కేశవాపూర్ ఎంపిటిసి సుగుణ, మత్స్యకారుల సంఘం అధ్యక్షకార్యదర్శులు ఐలయ్య, కుమారస్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.



చెరువులోకి చేపపిల్లలను వదులుతున్న దృశ్యం

వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, ASMA BEGUM QURESHI, R/o. 1-71, Nyalkal, Sangareddy, T.S, Changed My Name As "ASMA BEGUM" W/o. MOHAMMED ISMAIL QURESHI.

(Ro.No.2745346)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.



మునుగోడులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే, చైర్మన్‌ల దృశ్యం

## చౌటుప్పల్‌లో ఎమ్మెల్యే ప్రచారం

**పటాన్‌చెరువు, అక్టోబరు 22, ప్రభాతవార్త:** నల్గొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం శాసన సభ ఉప ఎన్నికలను పురస్కరించుకుని శనివారం పటాన్‌చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, సంగారెడ్డి మాజీ శాసన సభ్యులు, జిల్లా టిఆర్‌ఎస్ అధ్యక్షులు చింత ప్రభాకర్‌తో కలిపి ప్రచారం నిర్వహించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 1, 13వ వార్డులలో ఇంటింటికి తిరుగుతూ టిఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి మద్దతు పలకాలని వేడుకున్నారు. టిఆర్‌ఎస్ అభ్యర్థి విజయం సాధిస్తే కలగే అభివృద్ధి పనులపై వారు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి సభ్యులు కొలన్ బాల్‌రెడ్డి, అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, కార్పొరేటర్ నగేశ్ యాదవ్, జడ్పీటిసి సభ్యులు సుధాకర్‌రెడ్డి, నాయకులు నర్రా బిక్షపతి, సుల్తాన్‌పూర్ సర్పంచ్ పట్నం రాజు, బొల్లారం కౌన్సిలర్ రత్నం, బీరంగూడ ఆలయ కమిటి మాజీ చైర్మన్ తులసీరెడ్డి, కల్లప్పచారి తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న పోలీసుల దృశ్యం

**సంగారెడ్డి టౌన్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని పోలీసు కళ్యాణ మండపంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని జిల్లా ఎస్పీ యం రమణకుమార్ ప్రారంభించారు. శిబిరానికి యువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తాన్ని దానం చేశారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఎస్పీ రమణకుమార్ సూచించారు. పోలీసులు రక్తదానం చేయడం అభినందనీయమని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో డిఎస్‌పి రవీంద్రారెడ్డి, సిసి తిరుపతి, పిఆర్‌ఓ నాగరాజు, హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ అధ్యక్షులు రాహుల్, తాళ్లపల్లి సర్పంచన ప్రవీణ్, పోలీసు సిబ్బంది, డాక్టర్ జ్యోతి, డాక్టర్ శ్రీలేఖ, పోలీసు అధికారులు మహేష్‌గౌడ్, రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, యాదవరెడ్డి, డానియల్, దుర్గారెడ్డి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలలను సందర్శించిన కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు



పాఠశాలలో తొలి మెట్టు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

**మనూర్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** మండలంలోని మనూర్ కాంప్లెక్స్ పరిధిలోని ఆయా ప్రాథమిక పాఠశాలలను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నాగారం శ్రీనివాస్ శనివారం సందర్శించారు. కాంప్లెక్స్ పరిధిలోని ఎల్గోయి తండా, ఎల్గోయి, అతిమ్యాల్, నదిగడ్డ, హుక్రానా పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న చదువులపై విద్యార్థులతో ఆరా తీశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల వారిగా విద్యను అందుకుంటున్న తీరును పరిశీలించి టాంజెరినా యాప్‌లో నమోదు చేసుకున్నారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో విధులు నిర్వహించాలని, విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అందుకోవాలని శ్రీనివాస్ సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్ మఠం రాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు పంచలింగేశ్వర ఆలయంలో పూజలు

**మనూర్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 23వ తారీఖున మండలంలోని బాదల్‌గావ్ గ్రామంలోని శ్రీ పంచలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి బాధ్యులు తెలిపారు. మండలంలోని పుల్‌కుర్తి గ్రామానికి చెందిన పి మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శివాలయంలో అభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయంలో రాత్రి 8గంటల నుంచి కర్ణాటకలోని బీదర్ పట్టణానికి చెందిన కళాకారులచే భజన, కీర్తన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూజా కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పార్వతీ, పరమేశ్వరుల కృపమధనకు పాత్రులు కావాలని మహిపాల్‌రెడ్డి సూచించారు.

## చాకరిమెట్ల దేవస్థానంలో భక్తుల సందడి



పూజలు నిర్వహిస్తున్న దేవస్థానం అర్చకులు

**శివ్వంపేట, అక్టోబర్22 ప్రభాతవార్త:** ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రముఖ పుణ్య క్షేత్రంగా పేరు గాంచిన శివ్వంపేట మండల పరిధిలోని చాకరిమెట్లలో నెలకొని ఉన్న శ్రీ సహకార ఆంజనేయ స్వామి దేవస్థానంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించిన అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సత్యనారాయణ స్వామి వ్రతాల మండపంలో అనేక మంది దంపతులు వ్రతాలు జరిపించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం పాలక మండలి అన్నదాన సత్రంలో అన్నదాన వితరణ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఫౌండర్ చైర్మన్ ఆంజనేయ శర్మ, ప్రధాన అర్చకులు దేవదత్తు శర్మ, కార్య నిర్వాహణాధికారి సార శ్రీనివాస్, అర్చకులు శ్రీవత్సవ శర్మ, ప్రభురాజ శర్మ, దేవిశ్రీ శర్మ, సిబ్బంది శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

# సిఎస్‌ఆర్ నిధుల పర్యవేక్షణ పక్కాగా జరగాలి

## జిల్లా కలెక్టర్ శరత్

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 22, ప్రభాతవార్త:** జిల్లాలలోని పరిశ్రమలు కార్పొరేటర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద సిఎస్‌ఆర్ నిధులు అందజేసి జిల్లా అభివృద్ధికి సహకరించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ (సిఎస్‌ఆర్ నిధుల పర్యవేక్షణ కమిటీ) సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సిఎస్‌ఆర్ నిధుల పర్యవేక్షణా కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పరిశ్రమలను 5 క్లస్టర్స్‌గా చేశామన్నారు. యాజమాన్యాలు కంపెనీస్ యాక్ట్ మేరకు సామాజిక బాధ్యతగా జిల్లా అభివృద్ధికి సిఎస్‌ఆర్ కింద వివిధ అభివృద్ధి పనులకు నిధులను కలెక్టర్ ఖాతాలో జమ చేయాలన్నారు. సిఎస్‌ఆర్ నిధులను రాబట్టడానికి సరైన పర్యవేక్షణ కోసం ఏర్పాటుచేసిన కమిటీ వారి వారికి కేటాయించిన క్లస్టర్‌లోని పరిశ్రమలను పరిశీలించి నివేదిక అందజేయాలని సూచించారు. కంపెనీ యాక్ట్ నిబంధన మేరకు ఉన్నది లేనిది క్షుణ్ణంగా పరిశీలంచాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న కంపెనీలకు నోటీసులు జారీ చేయాలన్నారు. ఆయా అధికారుల బృందం తమకు కేటాయించిన ఆయా క్లస్టర్లలో ఉన్న అన్ని పరిశ్రమలను మరో మారు తనిఖీ చేసి పూర్తి వివరాలతో నివేదికను ఇవ్వాలని కలెక్టర్ శరత్ సూచించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్లు రాజర్షి షా, వీరారెడ్డి, కమిటీలోని ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శరత్, పక్కన జేసిలు, తదితరులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

## నివాసహక్కు కార్యక్రమం

**సంగారెడ్డి , అక్టోబర్ 22, ప్రభాతవార్త:** మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మెడ్వాన్ కార్యాలయంలో మానఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్ వారి సహకారంతో సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ఇండ్లలల్లో పనిచేస్తున్న గృహకార్మిక సంఘాల అధ్యక్షకార్యదర్శులకు సొంత (నివాసహక్కు కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గృహ నిర్మాణ శాఖ నోడల్ అధికారి, జిల్లా కో-ఆపరేట్ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ సొంత ఇల్లు పొందాలి అంటే అలంటి అర్హతలు ఉండాలి అంటే ప్రతి మనిషికి నివాసం ఉండే హక్కు ఉంది, దానికి కల్పించే బాధ్యత ప్రభుత్వానిదే అని, నివాసం పొందాల్సిన అర్హతలు ఏవి ఆధార్‌కార్డు, తెల్లరేషన్‌కార్డు ఉండాలి అన్నారు. కారు గని ఇదివరకు ఇల్లు ఉంటే అర్హులు కారని అన్నారు. ఇట్టి దరఖాస్తును తాహసిల్దార్ కార్యాలయంలో అందజేయాలని తెలియజేవారు. ఇది డబుల్ బెడ్‌రూమ్‌కి వర్తిస్తుందన్నారు. ఇప్పుడు ప్రభుత్వం ఇంటి స్థలం ఉంటే మూడు లక్షల రూపాయలు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. అనంతరం మెడ్వాన్ డైరెక్టర్ హెచ్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ గృహ కార్మికులంగా మీ నివాస హక్కులను పొం దేందుకు అర్హులన్నారు. అందరు కాపాడుకునేందుకు మీరందరూ మీ తోటి వారతో కలిసి కట్టుగా ఉండి, అధికారుల దృష్టికి తీసుకోని నివాస హక్కులు పొందాలని అన్నా రు. ఈ కార్యక్రమంలో 60 మంది గృహకార్మిక సంఘాల అధ్యక్షకార్యద్శులు పాల్గొన డం జరిగింది. వీరితో పాటు మెడ్వాన్ కో-ఆర్డినేటర్ పి స్వప్న, చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ ముజీబ్, మెడ్వాన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొలువుదీరిన శ్రీ కేతకీ ఆలయ పాలక మండలి



ఆలయ కమిటి సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**ఝరాసంగం, అక్టోబరు 22, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఝరాసంగంలో పార్వతీ దేవి సమేతంగా కొలువున్న శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి వారి ఆలయ పాలక మండలి శనివారం కొలువుదీరింది. పాలక మండలి సభ్యులచే జహీరాబాద్ శాసన సభ్యులు కొనింటి మాణిక్‌రావు ప్రమాణస్వీకారం చేయించి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటి చైర్మన్‌గా నీల వెంకటేశం గుప్తా, కమిటి ధర్మకర్తలుగా గొల్ల లక్ష్మయ్య, బోయిని సంగన్న, ఎంపి నాగన్న విఠల్‌రెడ్డి, పి బస్వరాజ్, మొగులయ్య, సిద్దన్నపాటిల్, పి మల్లికార్జున్, నారాయణరెడ్డి, గురునాథవి ప్రభు, ఎక్స్ ఆఫిషియో సభ్యులుగా బసయ్యస్వామి, జి నాగేశ్వర్‌లను దేవాదాయ ధర్మాదాయ శాఖ బాధ్యులు నియమించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు మాట్లాడుతూ ఆలయానికి సదూర ప్రాంతాలైన కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు దైవదర్శనానికి వస్తుంటారని, భక్తులకు దర్శనానికి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు పెంటారెడ్డి, జగదీశ్వర్, నర్సింలు, విజయ్‌కుమార్, మంకాల్ సుభాష్, అల్లాడి నర్సింలు, మురళిక్రిష్ణాగౌడ్, గుండప్ప, రామక్రిష్ణారెడ్డి, సంతు పాటిల్, నాగన్న, సిద్దన్న, వెంకటేశం, శ్రీకాంత్‌రెడ్డి, రంగా అరుణ్, ఆలయ ఇఓ తదితరులు పాల్గొన్నారు.

## ఝరాసంగంలో ఇండియన్ ఆయిల్ డే

**ఝరాసంగం, అక్టోబరు 22, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఝరాసంగంలోని కెఎస్‌ఎస్ ఇండేన్ గ్యాస్ కార్యాలయంలో శనివారం ఇండియన్ ఆయిల్ డే కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఇండేన్ గ్యాస్ కార్యాలయంలో కార్యాలయ యజమాని సంతోష్‌పాటిల్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి తీపిని పంచుకున్నారు. కార్యక్రమానికి హాజరైన గ్యాస్ వినియోగదారులకు స్వీట్లు పంచి నోటిని తీపి చేసి బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో కార్యాలయ మేనేజర్ చెన్నప్పపాటిల్, గ్రామస్థులు ఖాదర్ సాబ్, బిచ్చప్ప, రేవణ సిద్దేశ్వర, నరసింహులు, వినియోగదారులు పాల్గొన్నారు.

## మార్చ్ ఫాస్ట్‌లో మెదక్ జిల్లా వాసులు




మెదక్ జిల్లా తరపున మార్చ్ ఫాస్ట్‌లో క్రీడాకారులు

**మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్22 ప్రభాతవార్త:** ఎనిమిదవ తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్-2022 అండర్-14, 16, 18, 20 బాల బాలికలకు వరంగల్ జిల్లాలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి పోటీలకు 29 మంది క్రీడాకారులు మెదక్ జిల్లా తరపున మార్చ్ ఫాస్ట్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వినయ్ భాస్కర్, ఇఫ్కో డైరెక్టర్ ఎం. దేవేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు. తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, మెదక్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎ. మధుసూదన్, టీం కోచ్ లాజర్, టీం మేనేజర్‌గా మమతా, జిల్లా క్రీడాకారులు పాల్గొన్నారు.

## భారత్ జోడో యాత్ర మొబిలైజేషన్ కమిటీ కో-కన్వీనర్‌గా మహేందర్

**మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్22 ప్రభాతవార్త:** రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రకు సంబంధించి మొబిలైజేషన్ కమిటీ కో-కన్వీ నర్‌గా మెదక్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మహేందర్ నియ మితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులం, మతం, ప్రాంతం, వర్గాలుగా విడిపోతున్న ప్రజలను ఐక్యం చేయాలనే ఉద్దేశం తో రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు 3500 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ నెల 23న తెలంగాణ రాష్ట్రంలోకి ఈ పాదయాత్ర రాబోతుందని, దాదాపు 13 రోజుల పాటు పాదయాత్ర రాష్ట్రంలో కొనసాగుతుందని, కావున ప్రజలు ఎక్కడికక్కడ పెద్ద ఎత్తున పాల్గొని రాహుల్ గాంధీకి మద్దతు తెలపాలన్నారు.



జాతీయ రహదారిపై వాహనాలు ఢీకొన్న దృశ్యం

## ఢీకొన్న వాహనాలు.. ఒకరి మృతి

**పటాన్‌చెరువు, అక్టోబరు 22, ప్రభాతవార్త:** యూటర్న్ తీసుకుంటున్న వాహనాన్ని మరో వాహనం ఢీ కొన్న సంఘటనలో ఒకరు అక్కడికి అక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్ఐ రామనాయుడు కథనం ప్రకారం... రామచంద్రాపురం మండలం వెలిమెలకు చెందిన డీసీఎంలో సిమెంటు ఇటుకలను వేసుకుని సంగారెడ్డి వైపు వెళుతున్న క్రమంలో మండలంలోని ఇస్నాపూర్ గురుకులం వెనుకాల నుంచి అతి వేగంగా వచ్చిన జూబ్లీరెడ్ మిక్స్‌కు చెందిన లారీని ఢీకొంది. ప్రమాదంలో డీసీఎం క్యాబిన్ నుజ్జు నుజ్జు అయింది. క్యాబిన్‌లో కూర్చున్న జార్ఖండ్‌కు చెందిన ముస్తకా అన్సారి (30) క్యాబిన్‌లో ఇరుక్కుపోయి అక్కడికి అక్కడే మృత్యువాత పడ్డాడన్నారు. డ్రైవర్ ఇస్లావత్ గోపాల్, క్లీనర్ ఇమ్రాన్‌లు సైతం క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్రగా గాయాలకు గురయ్యారు. విషయం తెలుసుకున్న పటాన్‌చెరువు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి క్షతగాత్రులను బీరంగూడలోని ఫనేషియా ఆస్పత్రికి తరలించగా మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామనాయుడు పేర్కొన్నారు.

## భారతీనగర్ స్వచ్ఛ డివిజన్ అభివృద్ధి చేసుకుందాం

### కార్పొరేటర్ వెన్నవరం సింధుఆదర్శ్‌రెడ్డి



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సింధుఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, అక్టోబర్ 22, ప్రభాతవార్త:** భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజి కాలనీలో బస్‌స్టాప్ నుంచి మ్యాక్ సొసైటీ కాలనీ వరక చెత్త సేకరణ, ప్లాస్టిక్ వాడకంపై శనివారం అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ సింధుఆదర్శ్‌రెడ్డి పాల్గొన్నారు. మ్యాక్ సొసైటీ ఫ్రంట్‌లైన్ వారియర్స్, జీహెచ్‌ఎంసి సమన్వయంతో ఎల్ఐజిలో ప్రతి షాప్‌వారికి చెత్తను స్వచ్ఛ ఆటోలో వేయాలని, లేనిచో భారీ జరిమాన వేయడం జరుగుతుంది అన్నారు. పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, భారతీనగర్‌ను స్వచ్ఛ డివిజన్ అభివృద్ధి చేసేందుకు సహకరంచాలని కార్పొరేటర్ కోరారు. అనంతర ఎంఐజి కాలనీలో సొసైటీ ఆఫీస్ ప్రాంగణం వద్ద సిందుఆదర్శ్ మహిళా మండలి అధ్యక్షురాలు రాణి యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంను కార్పొరేటర్ సింధుఆదర్శ్‌రెడ్డి ప్రారంభించారు. అపోలో ఆసుపత్రి, ఫ్రెండ్స్ అసోసియేషన్ కలిసి నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరంలో ఎత్తు, బరువు, రక్తపోటు, పల్స్, రాండమ్ షుగర్, ఈసీజీ, ఐ స్క్రీనింగ్, డెంటల్ స్క్రీనింగ్, జనరల్ ఫిజిషియన్, కన్సల్టేషన్ సేవలను అందించాలి, ఈ కార్యక్రమంలో మహిళ సంఘాల నాయకురాలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## రక్తదానం చేద్దాం-ప్రాణదాతలుగా నిలుద్దాం

### -జిల్లా ఎస్పీ యం రమణకుమార్



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ యం రమణకుమార్ దృశ్యం

**పటాన్‌చెరువు, అక్టోబరు 22, ప్రభాతవార్త:** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని మండల పరిధిలోని ఇస్నాపూర్‌లో పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ యం రమణకుమార్ శిబిరాన్ని పరిశీలించి ప్రసంగించారు. రక్తదానం చేయడంతో చాలా మంది ప్రాణాలను కాపాడే అవకాశాలు దక్కుతున్నాయన్నారు. ఒకరు రక్తదానం చేసే మరొకరి ప్రాణాలు నిలబడే అస్కారం ఉందన్నారు. కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేసిన ప్రజలకు జిల్లా ఎస్పీ ధృవీకరణ పత్రాలను అందించి ప్రత్యేకంగా అభినందించారు.

## సమాజంలో విద్యార్థుల పాత్ర కీలకం

### -ఎస్ఐ వినయ్‌కుమార్

**న్యాల్‌కల్, అక్టోబరు 22, ప్రభాతవార్త:** సమాజంలో విద్యార్థుల పాత్ర కీలకమని హద్నూర్ ఎస్ఐ వినయ్‌కుమార్ అన్నారు. శనివారం పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని హద్నూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలను అరికట్టడంతో పౌరుడి పత్రం అంశంపై వ్యాస రచన పోటీలను నిర్వహించారు. కళాశాలలో విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని వ్యాస రచనలు రాస్తుండగా ఎస్ఐ ప్రత్యేకంగా పరిశీలించారు.

### విద్యార్థులకు ఆయుధాలపై అవగాహన

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం హద్నూర్‌లోని పోలీసు ఠాణాలో విద్యార్థులకు ఓపెన్ హౌజ్ నిర్వహించారు. విద్యార్థులకు ఆయుధాలపై, కార్యాలయంలోని రికార్డులపై అవగాహన కల్పించారు. పుస్తకాలలో నమోదు చేసే వివరాలపై వివరించారు. ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన పొంది ఉండాలని, దీంతో తమ కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించే అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కళాశాల బాధ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



బాబూమోహన్ సమక్షంలో బిజెపిలో చేరిన గడిపెద్దాపూర్ నాయకులు

## బిజెపిలో గడిపెద్దాపూర్ నాయకులు చేరిక

**జోగిపేట, అక్టోబర్22, ప్రభాతవార్త:** అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌కు చెందిన పలువురు బిజెపి నియోజకవర్గ ఇంఛార్జ్ ఉదయ్ బాబూమోహన్, అల్లాదుర్గం మండల అధ్యక్షులు ఆనంద్‌శర్మల ఆధ్వర్యంలో బిజెపిలో చేరారు. ఇందులో రిటైర్డ్ ఎస్ఐ యాదగిరి, రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి సాయిలుగౌడ్, మాజీ గౌడసంఘం అధ్యక్షులు నందంగౌడ్, కుర్మ సంఘం సభ్యులు రాములు, మాందాపురంకు చెందిన యాదగిరి, మల్లేశంలతోపాటు పలవురు బిజెపిలో చేరారు. నరేంద్రమోదీ ఆధ్వర్యంలో బిజెపి చేస్తున్న పలు అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై బిజెపిలో చేరుతున్నట్లు వారు తెలిపారు.

## చౌటకూరుకు వైకుంఠరథం అందజేత



వైకుంఠరథాన్ని అందజేసిన రాంరెడ్డిని సన్మానించిన దృశ్యం

**చౌటకూరు, అక్టోబర్22, ప్రభాతవార్త:** చౌటకూరు గ్రామపంచాయితీకి వైకుంఠరథాన్ని, ఫైజర్‌ను గ్రామానికి చెందిన పార్కల రాంరెడ్డి అందచేశారు. వీటిని శనివారంనాడు ఎంపిడివో మధులత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయటం అందరివల్ల కాదని, పార్కల రాంరెడ్డిది గొప్ప మనస్సని ఆయనని అభినందించారు. తెలంగాణ ప్రభుత్వం వైకుంఠదామాలు నిర్మించిందని, కాగా వైకుంఠరథం అందచేయటం వల్ల చాలా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. అనంతరం రాంరెడ్డిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు వీరమణిమొగులయ్య, ఆర్ఐ యాదగిరి, ఉపసర్పంచు అంది నాగయ్య, వార్డు మెంబర్ కైసర్, రాజు, శ్రీనివాస్‌రెడ్డి, వినోద, ఎంపివో శ్రీకాంత్, రాజుగౌడ్, నవీన్‌గౌడ్, ప్రభుగౌడ్, కుమార్‌గౌడ్, విద్యాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సొంత నిధులతో రోడ్డుకు మరమ్మత్తులు

### -కౌన్సిలర్ రాధా పరశురాం




రోడ్డుకు మరమ్మత్తులు చేస్తున్న దృశ్యం

**జిన్నారం, అక్టోబరు 22, ప్రభాతవార్త:** బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ఐడిఏ బస్తీలో పాడయిన రోడ్డుకు వార్డు కౌన్సిలర్ రాధా పరశురాం తన స్వంత నిధులతో రోడ్డుకు మరమ్మత్తు పనులకు శ్రీకారం చుట్టారు. శనివారం కౌన్సిలర్ రాధా పరశురాం బుల్‌డౌజర్ సహకారంతో 20వేల రూపాయలను వ్యయం చేసి రోడ్డుకు మరమ్మత్తు పనులు చేయించారు. వర్షాలకు రోడ్డుపై ఏర్పడిని గుంతల్లో నీరు నిల్చోవడంతో ప్రయాణీకులకు రాకపోకవలకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించిన రాధా పరశురాం స్వంత నిధులతో రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్పించి రోడ్డుపై జెసిబితో చదును చేయించారు. రోడ్డుకు మరమ్మత్తులు చేయించిన కౌన్సిలర్‌ను కాలనీ ప్రజలు నవీన్‌రెడ్డి, కృష్ణ, నరేశ్‌లు అభినందించారు.

### బాధితుడికి ఎంపిపి ఆర్థిక సహాయం

**జిన్నారం, అక్టోబరు 22, ప్రభాతవార్త:** ఇటీవల కురిసిన వర్షాలకు ఇల్లు కూలిపోవడంతో బాధిత కుటుంబానికి ఎంపిపి అధ్యక్షులు రవీందర్‌గౌడ్ శనివారం ఆర్థిక సహామయం చేశారు. మండలంలోని పెద్దమ్మ గూడెం గ్రామానికి చెందిన ఎర్రంతగారి శ్రీనివాస్ యాదవ్ ఇల్లు వర్షాలతో దెబ్బతింది. విషయం తెలుసుకున్న ఎంపిపి రవీందర్‌గౌడ్ తన వంతుగా ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాములు, అశోక్, సాయికుమార్, నరేష్, పట్నాటి భాస్కర్, ఎనగండ్ల నరేందర్, నాగరాజు, సీత సాయి, గొర్ల మల్లేష్, యాదగిరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కొమురం భీం జయంతి



పాఠశాలలో కొమరం బీమ్ జయంతిని జరుపుకుంటున్న దృశ్యం

**నాగల్‌గిద్ద, అక్టోబరు 22, ప్రభాతవార్త:** మండలంలోని మోర్గి గ్రామంలని మోడల్ కళాశాలలో ఆదివారం కొమురం బీం జయతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కళాశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కొమురం బీం చిత్ర పటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి నివాళులు అర్పించారు. కొమురం భీం అందించిన సేవలను ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### బాదంతో వేడుక చేసుకుందాం

దీపకాంతుల పండుగ తనతోపాటుగా హహోన్నతమైన వేడు కలను కూడా తీసుకువస్తుంది. ప్రియమైన వారిని కలుసుకునే అవకాశం అందిస్తుంది. దీపావళి పండుగను మనమంతా వైశ వోపేతంగా జరుపుకునేందుకు సిద్ధమవుతున్న వేళ గతానికంటే మరింత అప్రమత్తంగా ఈ క్షణాన వేడుక చేయడానికి మన మంతా లక్ష్యంగా చేసుకోవాలి. ఆరోగ్యవంతమైన స్నాక్స్, మిఠాయిలను తయారుచే యడం, పర్యావరణ అనుకూల వేడుకలు చేయడం ఇలా సానుకూల మార్పులను తీసుకువచ్చేందుకు ఎన్నో అవకాశాలున్నాయి. స్వీట్లు, స్నాక్స్ అన్ని పండుగల్లాగానే దీపావళిలోనూ అంతర్భాగంగా ఉంటాయి. బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం ప్రియమైన వారి పట్ల చూపే ప్రేమ, కృతజ్ఞతకు సూచిక.

### ఆరోగ్యానికి ఉత్తమ బహుమతి బాదం

బాదంలో 15 రకాల పోషకాలు ఉంటాయి. అందులో విటమిన్ ఈ, డైటరీ ఫైబర్, ప్రొటీన్, రిబోఫ్లావిన్, మాంగనీస్, ఫోలేట్ వంటివి ఉంటాయి. క్రమం తప్పకుండా బాదం తింటే గుండె చర్మ ఆరోగ్యం మెరుగుపడటం, మధుమేహనం బరుతు నియంత్రణలో ఉంటాయి.